
తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
నల్లగొండ - సూర్యాపేట
యాదాద్రి భువనగిరి
NALGONDA-SURYAPET
YADADRI BHUVANAGIRI
ఆదివారం, 20 అక్టోబర్ 2024


## నిధులు ఉన్న అభివృద్ధికి నోచుకోని ఆలేరు

**మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి**

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): ఆలేరు అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు (టి యు ఎఫ్ ఐ డి) 15 కోట్ల రూపాయల నిధులు ఉన్న ఆలేరు అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆలేరు పట్టణంలోని అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కేటాయించిన 15 కోట్ల రూపాయలతో ఆలేరు అభివృద్ధి ఎందుకు జరపడం లేదని, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయడానికి నిధులు ఉన్న నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని అన్నారు. ఆలేరు పట్టణంలో మున్సిపల్

మిగతా 2లో..



# మహా వైభవోపేతంగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం

## శోభాయమానంగా జరిగిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వసంతోత్సవ సేవ



యాదాద్రి భువనగిరి అక్టోబర్ 19(ప్రజా జ్యోతి) శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయణం, శరత్ ఋతువు, ఆశ్వీయుజ మాసం ,కృష్ణ పక్షము,విదియ,శనివారము,చతుర్దశ భువనాధీశుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు.సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. ఉదయం 5:45 నిమిషాలకు

మిగతా 2లో..

# కండీషన్స్ అప్లై..

## ధాన్యం బోనస్ కు బోలెడు షరతులు!!!!

- -సన్న రకం ధాన్యం బోనస్ పై రైతుల పెదవి విరుపు...
- -బోనస్ షరతులపై రైతుల్లో వ్యతిరేకత
- -గింజ పొడువు వెడల్పు కొలతలు నిబంధనలు...
- -బోనస్ అడ్డంకిగా మారిన వైనం...

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో సన్నరకం ధాన్యానికి రూ.500ల బోనస్ ప్రకటించారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలు కేంద్రాలలో సన్నధాన్యం విక్రయించే రైతులకు రూ.500ల బోనస్ ఇస్తామని చెప్పుకొచ్చారు. సిఎం రేవంత్ రెడ్డి సన్నరకం ధాన్యానికి రూ500ల బోనస్ ప్రకటించడంతో రైతులు సంబరపడ్డారు. హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకురూ. 2300 ఉండగా కలిపి రూ.500లు అదనంగా బోనస్ ప్రకటించడంతో రైతులు సంబరపడిపోయారు. క్వింటాలు సన్న ధాన్యానికి రూ. 2800లు వస్తాయని ఆనంద పడ్డారు. కానీ ఈ సంబరం మున్నాల ముచ్చటగానే మారింది.



నిడమనూరు, అక్టోబర్19(ప్రజా జ్యోతి): ప్రభుత్వం కొనుగోలు కేంద్రా లలో ధాన్యం కొనుగోలు ప్రారంభించక ముందే సన్నరకం ధాన్యం బోనస్ కు షరతులు విధించింది. సన్నరకం ధాన్యంకు బోనస్ వర్తించాలంటే షరతుల

మిగతా 2లో..

# మూసీకి అడ్డుపడితే.. మరో ఉద్యమం తప్పదు

- నల్గొండ అంటే పోరాటాల గడ్డ
- మూసీ నీళ్లతో కేన్సర్,గుండె, కిడ్నీ, తోపాటు తీవ్రమైన జబ్బులు
- కూలీపోయిన కాళేశ్వరం కు 33 కోట్లు చెల్లించారు
- కేటీఆర్ స్నేహితుని కంపెనీ గ్లోబరీనాతో విద్యార్థుల మరణాలు
- కేసీఆర్, కేటీఆర్ రాజకీయాల కోసం ప్రజలు బలికావాలా..?
- అగ్గిపెట్టే దొరకలేదని హరీష్. శ్రీకాంతాచారి ప్రాణం తీసిండు
- మూసీ శుద్ధీకరణకు పూనుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు
- తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.



నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిమంది ప్రజల జీవితాలతో ముడిపడ్డ మూసీ శుద్ధీకరణను అడ్డుకుంటే ఆనాటి రజాకార్లపై తిరుగుబాటు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమం మళ్లీ పునరావృతం అవుతుందని హెచ్చరించారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మూసీ కాలుష్యంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న నల్గొండ జిల్లా ప్రజలను వివరిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అన్యాయం జరిగిందనే తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకుంటే.. గడిచిన పదేండ్లలో నల్గొండ జిల్లాకు తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. నల్గొండ ప్రజల్ని నాయకులు రెచ్చగొడుతున్నారని చెబుతున్న కేటీఆర్ మాటలు పూర్తిగా సత్యదూరమని చెప్పిన ఆయన.. నల్గొండ ప్రజలు రెచ్చగొడితే రెచ్చిపోయేంత అమాయకులు కాదని.. స్వతహాగా పౌరుషం ఉన్న వ్యక్తులమని ఆయన అన్నారు.

ప్రజా జోతి ప్రతినిధి /నల్గొండ

నల్గొండ ప్రజలకు పోరాటాలు కొత్తకాదని.. ఇలాగే మూసీకి అడ్డంపడితే మీ ఇండ్ల ముందు శాంతియు-ంతంగా లక్షలమంది నల్గొండ బిడ్డలతో కలిసి ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. మూసీకి అడ్డుపడే ప్రతీ రాజకీయ పార్టీని నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ లో ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని ఆయన హెచ్చరించారు. మూసీ కాలుష్యంతో ప్రజలు క్యాన్సర్, నరాల జబ్బులు, గుండె, కిడ్నీలు పాడైపోవడం, పిల్లల్లో పెరుగుదల లోపించడం, కంటి సమస్యలు, చర్మవ్యాధులతో నానా అవస్థలు పడుతున్నారని.. ఇంకా వాళ్లు అలాగే చచ్చిపోవాలని కేటీఆర్ కోరుకుంటున్నారా అంటూ ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ మోసాలకు ఇప్పటికే నల్గొండ నరకయాతన పడుతున్నదని.. ఇప్పుడు ఆయన కొడుకు మోపయ్యిండని ఆక్షేపించారు. ఎవ్వరు అడ్డువచ్చిన మూసీ విషయంలో వెనకడుగువేసే పరిస్థితే లేదని తేల్చిచెప్పారు. మూసీ డీపిఆర్ చేసిన మెయిన్ హార్ట్ టీ కంపెనీ 29 దేశాల్లో అద్భుతమైన కట్టడాలను కట్టిందని ఎక్కడో పాకిస్థాన్ లో కేసు అయ్యిందని.. మూసీపై

మిగతా 3లో..

## నిధులు ఉన్న అభివృద్ధికి నోచుకోని ఆలేరు

మొదటిపేజీ తరువాయి..

భవన నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు, పట్టణంలోని మిల్క్ సెంటర్ నుండి దుర్గమ్మ గుడి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి మూడు కోట్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం 9 కోట్లు నిధులు ఉన్న పనులు మాత్రం జరపడంలో పాలకపక్షం నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ శంకుస్థాపన చేసిన పనులకు నిధులు ఉన్న నిర్మాణం పనులు చేయలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి పనులను ఎందుకు నిలిపివేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే హామీల అమలు కోసం పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# కండీషన్స్ అప్లై..

మొదటిపేజీ తరువాయి..

రూపంలో ఆంక్షలు పెట్టింది. ఈ నిబంధనలు రైతులకు బోనస్ ను వర్తింప చేయడంలో అడ్డంకిగా మారాయి. రైతులలో ఆశలు సన్నగిల్లాయి. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500లు ఇస్తుందని ప్రకటించి ఇప్పుడు ఆంక్షలు పెట్టడం షరతులు వర్తింప చేయడం ఏమిటని




రైతులు ప్రశ్నిస్తున్నారు. గింజ పొడవు వెడల్పు కొలతలు కొలిసి నిబంధనల మేరకు ధాన్యం గింజలు ఉంటేనే క్వింటాలుకు రూ.500లు చెల్లిస్తామని చెప్పడం పట్ల రైతులలో వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. గింజ పొడవు ఆరుమిల్లీ మీటర్ల కంటే తక్కువగా ఉండాలి. గింజ వెడల్పు రెండు మిల్లీ మీటర్ల కంటే తక్కువగా ఉండాలి. గింజ పొడవు వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీ మీటర్ల కంటే తక్కువగా ఉండాలి అనే నిబంధనలనువిధించారు.

ఈ నిబంధనలకు లోబడి ఉన్న సన్నరకం ధాన్యానికి మాత్రమే క్వింటాలుకు రూ.500ల బోనస్ వర్తిస్తుంది. గింజ పొడవు వెడల్పు నిష్పత్తులు కొలతలు ఆంక్షలు పట్ల రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికే వరి ధాన్యం చేతికి వచ్చి కోతలు కొనసాగుతుండగా వాతావరణంలో మార్పులు సంభవించి వర్షాలు కురుస్తుండడం కాలం కలిసి రాకపోవడం పట్ల రైతు లలో అసహనం వ్యక్తం అవుతుండగా ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ బోనసు ఆంక్షలు పెట్టడం పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు.

**-ధాన్యం బోనస్ కు బోలెడు కాంక్షలు ..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ నుంచి సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ500ల బోనస్ ప్రకటించింది. ఈ బోనస్ ప్రకటన పట్ల రైతులు సంబర పడిపోయారు. కానీ రైతుల సంబరం మున్నాళ్ళ ముచ్చటగానే మారింది. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మకుండానే ప్రభుత్వం బోనస్ కు బోలెడు ఆంక్షలు పెట్టింది. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ500ల బోనస్ పొందాలంటే గింజ పొడవు వెడల్పు నిష్పత్తులకు ఆంక్షలు విధించింది. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకే ధాన్యం గింజ పొడవు వెడల్పుల నిష్పత్తి ఉంటేనే బోనస్ వర్తిస్తుందని షరతుల విధించింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ఈషరతుల నిబంధనలను ప్రదర్శనకు ఉంచారు. బోనస్ లభించాలంటే బోలెడు ఆంక్షలు పెట్టడం పట్ల రైతులు ఆగ్రహ వేషాలు వ్యక్తం చేస్తున్నారు. సన్న రకం ధాన్యానికి బోనస్ ఎవరు ఇవ్వమన్నారు. ఆంక్షలు ఎవరు పెట్టామన్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులను ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకునేలా చేస్తున్నాయి.

**-ప్రైవేట్ వైపే మొగ్గు చూపుతున్న రైతులు :**

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మేందుకు ఈ ఖరీఫ్ సీజన్లో ఆసక్తి చూపడం లేదు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ ను ఒక చేత్తో ప్రకటించి మరో చేత్తో నిబంధనల రూపంలో ఆంక్షలు పెట్టడం రైతులను ఇబ్బందికి గురి చేస్తుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల పరిధిలో అధిక శాతం రైతులు వచ్చి ధాన్యాన్ని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. క్వింటాలుకు పచ్చి ధాన్యానికి ప్రైవేటు వ్యాపారులు రూ 2200నుంచి రూ.2300 వరకు చెల్లిస్తున్నారు. మూడు కిలోలు తరుగు రూపంలో కోత విధిస్తున్నారు. వారం రోజులలో డబ్బులు చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అరబెట్టి క్వింటాలుకు 2300 రూపాయలు వచ్చే పరిస్థితిలే ఉన్నాయి. మరోవైపు బోనస్ అందుతుందా అంటే దానికి సవాలక్ష ఆంక్షలు ఉండడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సన్నరకం ధాన్యం బోనస్ విషయంలో ఆంక్షలు తొలగించకపోతే ప్రభుత్వంపై రైతులలో మరింత వ్యతిరేకత వ్యక్తం అయ్యే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

## చండూర్ హై స్కూల్ హెడ్మాస్టర్ పై చర్యలు తీసుకోవాలి

ప్రజా జోతి ప్రతినిధి /నల్గొండ

చండూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో వంట చేసే మహిళలను అసభ్య పదజాలంతో బూతులు తిడుతూ వేధిస్తునన్న ప్రధానోపాధ్యాయులు ఎడ్ల బిక్షంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా ఆదనపు కలెక్టర్ పూర్ణా చందర్ కు వినతిపత్రం అందజేశారు.



అనంతరం వారు మాట్లాడుతూ,పేర్ల రాజమ్మ,, ధనమ్మ, సరిత, స్వాతిముత్యం మహిళలు సమాబావణ సంఘం నుండి గత పది సంవత్సరాలుగా చండూర్ హై స్కూల్ నందు పనిచేస్తున్న వారి పై హెడ్మాస్టర్ తీవ్రమైన దుర్భాష పాత జాలంతో బూతులు తిడుతూ తొలగించి ప్రభుత్వ నియమ నిబంధనకు విరుద్ధంగా తనకు సంబంధించిన ప్రైవేటు వ్యక్తులను పనిలో పెట్టుకోవడం జరిగినదని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ నవదీప్ శేఖర్ కిరణ్. సంగం సెంట్రల్ కమిటీ సభ్యులు కిన్నర జగదీష్ మనమధ్య యాదయ్య ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ అల్లంపల్లి కొండన్న రాష్ట్ర కోఆర్డినేటర్ బాకీ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహా వైభవోపేతంగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం

మొదటిపేజీ తరువాయి..

శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారపుబావి నుండి తీసుకు వచ్చి. ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన రంగురంగుల పుష్పమాలలతో తోమాల సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. అనంతరం లక్ష్మి మంటపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పసుపు కుంకుమ చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వర్ణగిరి నిత్య నూతన వధూవరులైన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలనుదరింపజేసి,మణిమయ శోభిత స్వర్ణాభరణాలతో, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి శ్రీవారి వైభవోత్సవ మండపం నందు శ్రీ స్వామివారి నిత్య కళ్యాణమహోత్సవాన్ని అర్చకస్వాములు కన్నులపండుగగా నిర్వహించారు. భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్నితిలకించి మంత్రముగ్ధులైనారు. ప్రతిరోజు స్వర్ణగిరిలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 4500 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



సాయంత్రం 6:30 కు భక్తుల పాలిట కొంగుబంగారమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తులు గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారికి మంగళహారతులు సమర్పించారు భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.

## మిర్యాలగూడలో గిరిజన గురుకులం లో పురుగుల మందు త్రాగి 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

### పరిస్థితి విషమం నల్లగొండ ఆసుపత్రి కి తరలింపు

### శుక్రవారమే బాలికను గురుకులం లో వదిలి వెళ్లిన తండ్రి

### సాయంత్రానికి వెలుగు చుసిన ఘటన

మిర్యాలగూడ, అక్టోబర్ 19,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడలో ని గిరిజన బాలికల గురుకులం పాఠశాల లో శుక్రవారం రాత్రి కలకలం చోటు





చేసుకుంది. 9వ తరగతి చదువుతున్న బాలిక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడిన సంఘటన జరుగగా,గమనించిన గురుకుల సిబ్బందిహుటాహుటిన ఏరియా ఆసుపత్రికి, పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి నుండి నల్లగొండ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్న సంఘటన చోటు చేసుకుంది. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని సాత్ తండా కు చెందిన బాలిక మిర్యాలగూడ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. దసరా సెలవుల అనంతరం విద్యార్థిని తండ్రి పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో వదిలి వెళ్ళాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి తో బాధపడుతున్నట్లు విద్యార్థిని పాఠశాల సిబ్బందికి తెలుపగా, వెంటనే మిర్యాలగూడలో ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు□□ క్రిమిసంహారకమందు తాగినట్లు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రాత్రి ఎనిమిది గంటల సమయంలో తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెంటిలేటర్ పై చికిత్స అందజేస్తున్నట్లు సమాచారం. ఆత్మహత్య ప్రయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న గురుకులాల నల్లగొండ ఆర్ సి ఓ ఆగస్టన్ పాఠశాలకు చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ సి ఓ, పాఠశాల ప్రిన్సిపాల్ సరిత మాట్లాడుతూ విద్యార్థిని కళ్ళు తిరుగుతున్నాయని,కడుపునొప్పి తో బాధపడుతున్న అని తెలుపగా వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అక్కడ స్టాఫ్ నర్స్ ని పిలిచి చూపించగా విద్యార్థిని పురుగుల మందు త్రాగి నట్లు తెలిపడం తో ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు .చికిత్స పొందుతున్న విద్యార్థిని వద్దే ఉండి పరిస్థితి పర్యవేక్షించినట్లు వారు తెలిపారు.

విద్యార్థిని తల్లితండ్రులు మాట్లాడుతూ తమ కూతురు ని పాఠశాలకి పంపి వచ్చే వరకు మాకు మా పాపా వద్ద ఎలాంటి పురుగుల మందు వాసన రాలేదన్నారు .మేము ఇంటికి వచ్చాక మీ అమ్మాయి ఆరోగ్యం బాగాలేదు అని సిబ్బంది తెలుపగా అక్కడికి వెళ్లి మా అమ్మాయిని అడుగగా మొదటగా నాన్నమ్మ ఇంట్లో మందు తాగాను అని తరువాత మళ్ళీ పాఠశాల లోనే పురుగుల మందు తాగాను అని తన తల్లికి చెప్పినట్లు వారు తెలిపారు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఆసుపత్రికి చేరుకొని బాలికను మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. ఈ సంఘటనపై తమకు వ్రాతపూర్వక ఫిర్యాదు అందలేదని సిఐ పి. నాగార్జున తెలిపారు.

# మూసీకి అడ్డుపడితే.. మరో ఉద్యమం తప్పదు

మొదటిపేజీ తరువాయి..

అవినీతి బురదజల్లడం దారుణమని ఆయన మండిపడ్డారు.కేసిఆర్ మానసపుత్రిక కాళేశ్వరం డీపీఆర్ ను తయారు చేసిన వ్యాపోస్ ను ఒరిస్సా గవర్నమెంట్ బ్లాక్ లిస్ట్ లో పెట్టింది.గుజరాత్ లో నిషేధించిందని చెప్పిన మంత్రి.. కేటీఆర్ బంధువుల సంస్థ గ్లోబరిన పదుల సంఖ్యలో విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న విషయాన్ని కేటీఆర్ ప్రజలకు ఎందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వేసి చెప్పలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం డీపీఆర్ కు 2015 లోనే 33 కోట్లు చెల్లించారని. ఇప్పుడు 140 కోట్లు చెల్లిస్తుంటే గగ్గోలు పెడుతున్నరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడటం వచ్చని అబద్ధాలు చెప్పి ప్రజల్ని నమ్మించాలనుకుంటే తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని.. కేసిఆర్ కుటుంబ మోసాల్ని ప్రజలు పసిగట్టిన్రు కనుకనే 16 కు 16 స్థానాల్లో గుణపాఠం చెప్పారని ఎద్దేవా చేశారు. అసలు మూసీ డీపిఆర్ పూర్తికాకముందే ఎందుకు లక్షల కోట్లని ఎగిరెగిరి పడుతున్నరని ప్రశ్నించిన ఆయన.. కేటీఆర్, హరీష్ రావు అమెరికాకు పోయి ప్రభాకర్ రావును ఇండియాకు రాకుండా ఎందుకు అడ్డుపడుతున్నారో ముందు చెప్పాలని సవాల్ చేశారు.

మిషన్ భగీరథలో 5 వేల కోట్ల రూపాయలను దోచుకున్న కేసిఆర్ కుటుంబం అవినీతి వల్ల ఇప్పటికి అనేక గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లే తాగుతున్నారని ఆయన ఆరోపించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను మార్చుకున్న వాళ్లకు ప్రతీది ఏటీఎం లలాగే కనిపిస్తున్నాయని చురకలు అంటించారు. ఆ దోపిడి యావ నుంచి బయటికి రాలేకనే అన్నిట్లో అవినీతి జరిగిందని గగ్గోలు పెడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 2 వేల కోట్లు పెట్టి 9 కిలోమీటర్ల ఎస్.ఎల్.బీ.సీ సొరంగం పని పూర్తి చేస్తే ఇవ్వాల నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు బంగారు మాగాణంగా మారేవని, ఫ్లోరైడ్ ఇబ్బందులు తప్పేవని.. కేవలం నాకు పేరొస్తుందనే ఎస్.ఎల్.బీ.సీ సొరంగాన్ని పదేండ్లు పక్కన పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్.ఎల్.బీ.సీ సొరంగం పూర్తియితే శ్రీశైలంలో డెడ్ స్టోరీజీ ఉన్నా నల్గొండకు నీటి కొరత ఉండేది కాదని ఆయన అన్నారు. అంతేకాదు, పులిచింతకు నీళ్లను సీమాంధ్రకు తరలిస్తుంటే అక్కడి మోటర్లను తగులబెట్టానని.. ఆ విషయం అందరికి తెలుసన్న మంత్రి.. ఎస్.ఎల్.బీ.సీ సొరంగం మంజూరీ చేయకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని వై.యస్. రాజశేఖర్ రెడ్డికి తెల్చిచెప్పినట్టు గుర్తు చేసుకున్నారు. ఆనాడు పోరాడి ప్రాజెక్టును మంజూరీ చేయించి 80 శాతం పనులు పూర్తి చేస్తే.. కేవలం 11 కిలోమీటర్ల పనుల పూర్తి చేసేందుకు పదేండ్లు సరిపోకపోవడం అంటే.. నల్గొండపై వారికున్న సవతితల్లి ప్రేమకు నిదర్శనమని ఆరోపించారు. బ్రహ్మణవెల్లంల, శివన్నగూడెం, పూర్తిచేస్తే మరింతగా రైతులకు ఉపయోగం అవుతుందన్న మంత్రి నల్గొండలో బోర్ వేస్తే నీరు పసుపు రంగులో వస్తున్న విషయం ప్రపంచమంతా తెలుసుని చెప్పారు. ఆగష్టులో కేంద్ర పర్యావరణ సంస్థ మూసీలో ప్రమాదకరస్థాయిలో హెవీ మెటల్స్ ఉన్నాయని చెప్పిన సంగతి కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మేం మంత్రులం అందరం కలిసి ముఖ్యమంత్రితో చర్చించి మూసీకి పరిష్కారం చూపెట్టాలని కోరామని తెలిపిన మంత్రి.. కోటిమంది తెలంగాణ బిడ్డల బతుకులు బాగు చేసేందుకే మూసీ శుద్ధీకరణను తీసుకున్నామని ఆయన వివరించారు. కేసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మూసీలో ఫ్లోరిన్ తో పాటు, ఇతర హెవీ మెటల్స్ పెరిగాయని కేంద్రప్రభుత్వ సంస్థలు తేల్చిన విషయం కేటీఆర్ కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఎస్టీపీల ద్వారా రెండుమూడు దశల్లో ట్రీట్మెంట్ చేసినప్పటికి వందశాతం హెవీమెటల్స్ ను తీసివేయలేమని ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు చెప్తుంటే ఎస్టీపీ ద్వారా నల్గొండకు స్వచ్ఛమైన నీళ్లు ఇవ్వడానికి ప్రయత్నించామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు.

కేటీఆర్ కు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేదంటే దేశప్రధానికి జూమ్లా పీఎం %-% రాష్ట్రముఖ్యమంత్రిని హౌలా సీఎం అని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మీకు డబ్బుంటే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వధినేతలు కనిపించరా అంటూ ఆగ్రహవ్యక్తంచేశారు. ఆయన అధికారం పోవడంతో మానసికంగా ఇబ్బందులు పడ్డట్టు కనిపిస్తుందని.. డాక్టర్ కు చూపించుకోవాలని కేటీఆర్ కు సలహా ఇచ్చారు.

కేసిఆర్ కొడుకు కాకుంటే కేటీఆర్ ను ఎవరు గుర్తుకూడా పట్టరని.. అట్లాంటిది కష్టపడి పైకొచ్చిన మా ముఖ్యమంత్రిపై, మాపై అవాకులు చెవాకులు పేలుతున్నాడని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రెజువేనేషన్ స్పెల్లింగ్ రాదని.. కండ్లు నెత్తికెక్కి మాట్లాడిన కేటీఆర్ మాటలు ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసేవిధంగా ఉన్నాయని మండిపడ్డారు. మేం %గ్లా% స్కూళ్లో చదివినప్పటికి మేం సంస్కారవంతంగా మాట్లాడతామని చెప్పిన మంత్రి.. అమెరికాకు పోయి చదువుకొని కోట్లమంది ప్రజల ప్రాణాలను బలితీసుకోవాలని చూడటం బాధాకరమని ఆయన అన్నారు. ఆయన ఏదో పెద్ద పెద్ద నిర్మాణాలు చేసినట్టు చెప్తారని..కానీ ఆయన చేసిన అద్భుతం మురికి కూపం దుర్గం చెరువుమీద తీగల బ్రిడ్జ, టీహబ్ బిల్డింగ్ తప్పా కేటీఆర్ చేసింది ఏముందని ఆయన ప్రశ్నించారు. 80 వేల పుస్తకాలు చదివిన ప్రపంచ మేథావి కేసిఆర్ ఫాంహౌజు నుంచి బయటికు వచ్చి మూసీ వల్ల మూడు జిల్లాల ప్రజలు పడుతున్న సమస్యలపై మాట్లాడాలని మంత్రి సూచించారు. నల్గొండలో పుట్టిన చిట్టి నాయుడు ఒకరు మొన్నటి ఎన్నికల్లో 3 వేల ఓట్లతో గెలిచినప్పటికి ఆయనకు నల్గొండ సమస్యలు పట్టవని అన్నారు.. బస్సు కిరాయిలు లేనోడికి ఇప్పుడు 80 ఎకరాల ఫామ్ హౌజ్ ఉందని.. ఉప్పల్ లో వాటర్ ప్లాంట్ పెట్టి నడిపిన వ్యక్తి.. కేసీఆర్ కు ఉన్నంత ఫామ్ హౌజ్ ఎట్లా వచ్చిందని ప్రశ్నించారు. అధికారం అడ్డం పెట్టుకొని పది వేల కోట్లు దోచుకున్న ఆ చిట్టినాయుడు.. ఎప్పుడు నల్గొండ బిడ్డల బాగుకోసం పనిచేయలేదని ఆరోపించారు.. మొన్నటి ఎన్నికల్లో మా అభ్యర్థి దామోదర్ రెడ్డికి మోకాలి ఆపరేషన్ కావడంతో చిట్టి నాయుడు బతికిబయటపడ్డడని లేదంటే యాభైవేల మెజార్టీతో ఇంటికి పంపేవాళ్లమని తేల్చిచెప్పారు.

## ఉపకార వేతనాలు, బోధన రుసుము బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

హుజూర్ నగర్, అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉపకార వేతనాలు బోధన రుసుముల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు సోమగాని నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో హుజూర్ నగర్ ఆర్డీఓ వి. శ్రీనివాసులు కి శనివారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 12.50 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, వికలాంగుల విద్యార్థులకు సంబంధించి గత మూడేళ్లుగా దాదాపు రూ.4,500/- కోట్లు బకాయిలు ఉన్నాయనీ, ఈ బకాయిలను విడుదల చేయక పోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వట్లేదనీ ,అటు పై చదువులకు వెళ్లలేక ఇటు ఉద్యోగాలను చూసుకోలేక విద్యార్థులు నా నా యాతన పడుతున్నారనీ, ఫీజులు కట్టలేక విద్యార్థుల తల్లిదండ్రులు నరకం అనుభవిస్తున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని లేకుంటే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం నిర్మిస్తామని రేవంత్ సర్కార్ ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాకళాకారుడు బాదే నరసయ్య, ప్రజా వినియోగదారుల సంక్షేమ సంఘం గరిడేపల్లి మండల అధ్యక్షులు పిల్లుట్ల లింగయ్య, వినియోగదారుల సంక్షేమ సంఘం హుజూర్ నగర్ డివిజన్ కార్యదర్శి పందిరి యల్లారెడ్డి పాల్గొన్నారు.



## మహాత్మ గాంధీ యూనివర్సిటీ వి సి గా అల్తాఫ్ హుస్సేన్

ప్రజా జోతి ప్రతినిధి /నల్లగొండ

మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



చేసింది.ఈ సందర్భంగా శనివారం మాత్మ గాంధీ యూనివర్సిటీలో ఆయన చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు.గతంలో కూడా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్గా పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాలు కళాశాల యాజమాన్యాలు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో డిటిఎఫ్ ముందంజలో ఉంటుంది

జిల్లా కార్యదర్శి. ఎండి సిద్ధిక్ భాష, బి మంగు

తుంగతుర్తి అక్టోబర్ 19(ప్రజా జ్యోతి)

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ముందు వరుసలో ఉంటుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం డి సిద్ధిక్ భాష. బి మంగు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలను విడుదల చేసి పి ఆర్ సి ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మండల అధ్యక్షులుగా కచ్చిగల్ల నవీన్ ప్రసాద్, కార్యదర్శిగా భీమరాజు వెంకటమల్లు,ఉపాధ్యక్షులుగా పి కోటయ్య,పి వాణి,ఏ నరేందర్, కార్యదర్శిలుగా సుజాత,ఎంఏ హకీం,సతీష్,జి సుధాకర్, కోశాధికారిగా ఎం వెంకన్న,జిల్లా కౌన్సిలర్లుగా ఎం మధు, కే వెంకట్ రెడ్డి లు ఎన్నికయ్యారు.



## వాటర్ క్లోరినేషన్ పై శిక్షణ శిబిరం

తుర్కపల్లి మండలం, అక్టోబర్ 19(ప్రజా జ్యోతి )

తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు శనివారం వాటర్ క్లోరినేషన్ పై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి కరుణాకర్ మాట్లాడుతూ శుక్రవారం రోజున నీటి నాణ్యత ,క్లీనింగ్, క్లోరినేషన్ పై శిక్షణను ఇచ్చినట్టు తెలిపారు. గత నాలుగు రోజుల నుండి నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం నేటితో ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీబాయి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, ఏఈఈ అనంతరెడ్డి, మిషన్ భగీరథ హెల్పర్స్ కనుక శ్రీనివాస్, కొండం నరసింహులు, సోన్నాయిల సత్తయ్య, చిలుక అంజయ్య, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు



## శ్రీ పలుగుల మైసమ్మ తల్లి దేవాలయంలో చోరీ

తుర్కపల్లి మండలం, అక్టోబర్ 19(ప్రజా జ్యోతి) తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలో గల శ్రీ పలుగుల మైసమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు



తెలియని వ్యక్తులు దేవాలయంలోనూ హుండీని పగలగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్సై తక్యుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎమ్మెస్ విజయ్ కుమార్ కు పలువురి పరామర్శ

### ఎమ్మెస్ విజయ్ కుమార్ ను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): ఆలేరు మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు ఎమ్మెస్ విజయ్ కుమార్ ను ఆలేరు



మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. విజయ్ కుమార్ అల్లుడు ఎబుల్ డానియల్ గురువారం అకస్మాత్తుగా మ-రణించగా విషయం తెలుసుకున్న పలువురు ఆయనకు తమ రకాల సాంభూతిని తెలియజేశారు. డానియల్ అకాల మరణం పట్ల వారు తీవ్ర సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్, ఒకటవ వార్డు కౌన్సిలర్ చింతలఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కందగట్ల నిర్మల నరేందర్, ఎగ్గిడి శ్రీశైలం, ద్వారపు శంకర్, వల్లెపు ఉప్పలయ్య, కౌన్సిలర్ సంగు భూపతి, జట్ట సిద్దులు, రాజశేఖర్, ఎండి బాబా, దోనకొండ కృష్ణ, మెరుగు శ్రీధర్, కర్రె అజయ్, పేరపు రాములు, ఎం విద్యాసాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## టీ 24 అవార్డుకు ఎంపికైన దూడల వెంకటేష్

ఆలేరు, అక్టోబర్ 19(ప్రజాజ్యోతి): ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ గా, ఎన్సిసి అధికారిగా విధులు నిర్వహిస్తున్న దూడల వెంకటేష్ ప్రతిష్టకారమైన టీచర్ ఎక్సెలెన్సి అవార్డు 2024 ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్కు చెందిన శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, స్కై లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 ఆదివారం నాంపల్లి లోని బిర్లా ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో శారదా ఫౌండేషన్ నిర్వాహకులు నుండి ఈ అవార్డులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ అవార్డుల కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోదండరామ్ లు హాజరవుతారని తెలిపారు. టి 24 కు వెంకటేష్ ఎంపిక అయిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయ బృందం వెంకటేష్ ను అభినందించారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### -సిఎం రిలీఫ్ ఫండ్ రూ. 30వేల500 చెక్ లు పంపిణీ

నిడమనూరు,అక్టోబర్19 (ప్రజాజ్యోతి): నిడమానూరు మండల కేంద్రంలోని సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు నిడమానూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యనారాయణ పంపిణీ చేశారు. శనివారం ఈసందర్భంగా స్థానిక మార్కెట్ కార్యాలయం ఆవరణలో ఇద్దరికి సిఎం రిలీఫ్ ఫండ్ రూ.30వేల500 లు



మంజూరైయ్యాయి. లబ్ధిదారుల్లో దారం నాగార్జున కు రూ.15వేలు500,తెలకపల్లి నాగమణి రూ.15వేలు చెక్కులను లబ్దిదారులకు నిడమానూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ముప్పారం గ్రామ శాఖ అధ్యక్షుడు ఆలంపల్లి మైసయ్య, ముప్పారం మాజీ సర్పంచ్ మేరెడ్డి వెంకటరమణ ,యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పగిళ్ల శివ, అన్నెబోయిన లక్ష్మీనారాయణ, సింగం రామలింగయ్య ,తదితరులు, పాల్గొన్నారు.

## నిరుద్యోగులపై పోలీసుల లాఠీ చార్జ్ అమానుషం

### -మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి

హుజూర్ నగర్, అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి): గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని, నిరుద్యోగుల పాలిటి శాపంగా మారిన జీవో నెంబర్ 29 ని సమీక్షించాలని అశోక్ నగర్ లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రూప్ వన్ అభ్యర్థులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసుల చేత లాఠీ చార్జ్ చేయించడం దుర్మార్గమైన చర్య అని హుజూర్ నగర్ మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి అన్నారు. శనివారం ఈ సందర్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ అభ్యర్థులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అడిగితే పోలీసులతో కర్కశంగా వారి గొంతులను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు, యువతకు రాహుల్ గాంధీ చేత అడ్డగోలుగా అబద్ధపు హామీలు ఇప్పించి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం వాటిని అమలు చేయాలని అడిగితే ఇటువంటి ధమనకాండకు పాల్పడుతుందన్నారు. స్త్రీ, పురుష అభ్యర్థులనే తేడా లేకుండా వారు భవిష్యత్తు లో ప్రభుత్వంలో ఉన్నత అధికారులుగా నియమితులవుతారు అనే సోయి కూడా లేకుండా వారిపై లాఠీచార్జి చేయించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్స్ ను పరిష్కరించాలని కోరారు.



## 'గురు' తర బాధ్యత మీదే..!

### విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

తుంగతుర్తి అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి) డీఎస్సీ 2024లో కొలువులు సాధించిన నూతన ఉపాధ్యాయులు శనివారం విధుల్లో చేరుతున్నట్లు రిపోర్టు చేయడం జరిగిందని మండల విద్యాధికారి బోయిని లింగయ్య తెలిపారు. మండలానికి 38 మంది నూతన ఉపాధ్యాయులు వచ్చినట్లు ఆయన తెలిపారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్స్ 08, ఎస్జీటీ లు 30 మంది నూతనంగా విధుల్లో చేరుతున్నట్లు రిపోర్టు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.



ఈ మేరకు మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో వారికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేపట్టాల్సిన బాధ్యతలు, తరగతి గది బోధన, పాఠశాల నిర్వహణ తదితరు అంశాలపై వివరించారు. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు మీరంతా మార్గదర్శకులు కావాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం నూతనంగా మండలానికి కేటాయించబడి రిపోర్ట్ చేసిన ఉపాధ్యాయులను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## టాటా ఏఐఏ మైక్రో లైఫ్ ఇన్సూరెన్స్ పేదలకు వరం : బ్రాంచ్ మేనేజర్ పోలిశెట్టి సైదులు

హుజూర్ నగర్ అక్టోబర్ 18(ప్రజా జ్యోతి): టాటా ఏఐఏ మైక్రో లైఫ్ ఇన్సూరెన్స్ పేదలకు వరమని టాటా ఏఐఏ కోదాడ బ్రాంచ్ మేనేజర్ పోలిశెట్టి సైదులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పాలసీదారుడు హుజూర్ నగర్ మండలం



శ్రీనివాసపురం గ్రామానికి చెందిన రెడ్డిమల్ల లచ్చయ్య మృతి చెందగా నామిని అయిన అతని భార్య రెడ్డిమల్ల బాలమ్మకు ఇరవై వేల రూపాయల చెక్ అందించామన్నారు. తక్కువ ఆదాయంతో బతికే వాళ్లకు ఆపద వస్తే నష్టపోకుండా ఆదుకోవడానికి మైక్రో ఇన్సూరెన్స్ సదుపాయం విస్తరించాలని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవెలప్మెంట్ అథారిటీ (ఐడీఆర్ఎ) నియమించిన కమిటీ సూచించిందన్నారు. టాటా ఏఐఏ మైక్రో లైఫ్ ఇన్సూరెన్స్ పేద ప్రజలకు అందుబాటులో తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఇన్సూరెన్స్ లబ్ధి చేకూర్చే విధంగా ఉన్నందున ప్రతి ఒక్కరు పాలసీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క కామన్ సర్వీస్ సెంటర్ (%జూజ%) ద్వారా కూడా పాలసీ తీసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ కొల్లూరు సంధ్య,నాగుల లక్ష్మి, రమణ,నాగమణి,కనకమ్మ, మరియమ్మ,పద్మ,లక్ష్మి,నవ్య, గోవిందమ్మ,గడ్డెమ్మ,ఆశ వర్కర్ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూపు-1 పరీక్ష వాయిదా వేయాలి..

నాంపల్లి,అక్టోబర్,19(ప్రజా జ్యోతి):జీఓ నంబర్ 29ని రద్దు చేసి గ్రూప్ -1 పరీక్ష వాయిదా వేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి నరేష్ పేర్కొన్నారు. శనివారం నాంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం స్వేరో స్టూడెంట్ యూనియన్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 29లో ఓపెన్ కేటగిరిలో రిజర్వేషన్లు వర్తించవు. వారికి ఇచ్చిన రిజర్వేషన్ల లోనే ఉద్యోగాలు పొందాలనేది బడుగు బలహీన వర్గాలకు ఈ జీవో ద్వారా తీవ్రస్థాయిలో నష్టం చేకూరుతుంది. కొన్ని సంవత్సరాల వాళ్ళ కల,శ్రమ వృధా అవుతుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈడబ్ల్యూఎస్ ద్వారా నిరుద్యోగులు నష్టపోతున్నారు. జీఓ ను రద్దు చేయాలి. అలాగే గ్రూప్-1 తేదీ పొడిగించి వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

# మందనపల్లిలో డ్యాగల అంజయ్య 13వ వర్ధంతి

## అంజయ్య స్మార్త సూపము వద్ద జండా ఎగరవేస్తున్న నాయకులు

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): ఆలేరు మండలం మదనపల్లి గ్రామ సర్పంచ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ నాయకుడు అంజయ్య 13వ వర్ధంతి తిరస్కరించుకొని శనివారం ఆయన స్మారక స్తూపం వద్ద పార్టీ గ్రామ కార్యదర్శి తమ్ముడి అంజయ్య పార్టీ జెండాను ఎగరవేసి అంజయ్య చిత్రపటానికి పూలమాండలి వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్ధన్ మాట్లాడుతూ ప్రజలచే సర్పంచ్ గా ఎన్నికైన అంజయ్య ఐదు సంవత్సరాలు నిజాయితీగా ప్రజలకు సేవ చేశాడని, గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని కొనియాడారు. విప్లవ ప్రజానాయకులు ప్రజల కోసం పోరాడి అమరులయ్యారని, వారి ఆశే సాధనకు అంకితమే పోరుబాటలో నడవాలని పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ సీత, కుర్రి మార్కండేయ, కడకంచి సత్తయ్య, కే బీరయ్య, కే రమేష్, కొమ్మిడి గోపాల్ రెడ్డి, ఇరుగ దిండ్ల వెంకటేష్, ఆర్ ఉదయ్, దారా యాదగిరి, కొమ్మిడి నరసింహారెడ్డి, శ్రీను, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాలు, డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): బాల్య వివాహాలు, మత్తుమందుల వినియోగంపై డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ లైన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ




జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పోయి చేసిన ఆలేరు సబ్ ఇన్స్పెక్టర్ రజనీకారు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యవివాహాలకు, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, చదువుపై ఇష్టం పెంచుకొని భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు మొత్తం మందులు అమ్మేవారి గురించి, వినియోగించే వారి గురించి పోలీసులకు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు, చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు హరిబాబు, స్వప్న, నందిని, సురేష్, కళాశాల అధ్యాపకులు రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జూకంటి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానం

## సబ్ ఇన్స్పెక్టర్ లక్షినారాయణ

భువనగిరి,అక్టోబర్ 19(ప్రజాజ్యోతి)
భువనగిరి పట్టణం లోని కుమ్మరివాడ లో ఉండే ప్రజలకు యూత్ సభ్యులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సబ్



ఇన్స్పెక్టర్ లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగ తనాలను నేరాలను నివారించ వచ్చు అని అన్నారు.ఒక్క సీసీటివి కెమెరా 100,మంది,పోలీసులతో సమానంగా పని చేస్తుందని తెలిపారు.అలాగే అనుమాన స్పదంగా ఎవరు కనబడిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.పట్టణం లో ఎవ్వరు కూడ శాంతి భద్రతలకు విఘాతం కల్పించిన ఊరుకునేది లేదని చట్టరీత్యా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులను వెంటనే తొలగించాలని దళితుల డిమాండ్: శ్రీనివాస్

చిలుకూరు అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి):
ధర్మసమాజ్ పార్టీ అధినాయకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశానుసారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు



గ్రామంలో దళితులపై జరిగినటువంటి దాడి సంఘటన ఆ గ్రామంలో ఉన్నటువంటి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది .ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితులకి పూర్తి న్యాయం జరగాలని అక్రమంగా అరెస్టు అయిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబాన్ని విడుదల చేయాలని దాడికి జరిగిన ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపించి నిందితులకు శిక్ష పడేలాగా చూడాలని ప్రభుత్వాన్ని



డిమాండ్ చేయడం జరిగింది ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ విజయరామరాజు, సైదులు, భాస్కర్ మరియు అంబేద్కర్ గ్రామ పెద్దలు విద్యావంతులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి.

## -ఐద్వా జిల్లా జిల్లా అధ్యక్షురాలు తంగేళ్ల వెంకట చంద్ర

హుజూర్ నగర్, అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి):
ఈనెల 21, 22, 23 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) జిల్లా అధ్యక్షురాలు తంగేళ్ల వెంకటచంద్ర




పిలుపునిచ్చారు. శనివారం అమరవీరుల స్మారక భవనంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను ఆమె ఆవిష్కరించి మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయని విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు చేసిన వారిని బిజెపి ప్రభుత్వం రక్షిస్తుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మతోన్మాదంతో మహిళలు తినే ఆహారం మీద, కట్టుకునే బట్టల మీద, ఆచార వ్యవహారాల మీద ఆంక్షలు విధిస్తూ మహిళలను బానిసలుగా చూస్తున్నారని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారిక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పేద మహిళలందరికీ నెలకు 2500 రూపాయలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిందని, అధికారంలోకొచ్చి పది నెలలు అవుతున్న ఇచ్చిన హామీని అమలు చేసిన పాపాన పోలేదన్నారు. సామాజిక పింఛన్లు 2000 రూపాయల నుండి నాలుగు వేలకు పెంచాలన్నారు. వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.12000 వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించి మహిళలకు ఉచిత విద్య, వైద్యం, రక్షణ కల్పించాలన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా అక్టోబర్ 21వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వేలాదిమంది మహిళలతో భారీ ప్రదర్శన, బహిరంగ నిర్వహిస్తున్నామన్నారు. ఈ బహిరంగ సభకు ఆల్ ఇండియా ఐద్వా జాతీయ నాయకురాలు మాజీ ఎంపీ బృందాకరత్ హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ ఇందిరాల. త్రివేణి, జిల్లా కమిటీ సభ్యురాలు సుందరి. రమ, బుద్ధి .ప్రియాంక, సూరపల్లి. ఝాన్సీ, ఆత్కూరి. నాగేంద్ర, ఆత్కూరి రాజ్యమ, వెంకటమ్మ, లచ్చువమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

## 5సంవత్సరాల క్రితం భర్త మృతి.
## తల్లితండ్రుల మరణంతో అనాధలుగా మారిన చిన్నారులు.
## ఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, సహాయం అందజేస్తామంటూ భరోసా

మిర్యాలగూడ, అక్టోబర్ 19,( ప్రజాజ్యోతి ):
విధి ఆ కుటుంబాన్ని వెంటాడింది... ఐదు సంవత్సరాల క్రితం తండ్రి



మృతిచెందగా... నేడు పిడుగు రూపంలో తల్లిని బలి తీసుకోవడంతో... చిన్నారులు అనాధలుగా మారిన హృదయ విధారక సంఘటన నల్గొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలాజీ తండా లో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జటావత్ నాగమణి (35) బాలంపల్లి గ్రామ శివారులో మిరప చేనులో కూలీ పనుల నిమిత్తం వెళ్ళగా, వర్షం రావడంతో చెట్టు కిందకు వెళుతున్న సమయంలో సమీపంలో పిడుగుపడటంతో తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిది అని తెలిపారు.మృతురాలికి ఇద్దరు కుమారులు వున్నారు.



5సంవత్సరాల క్రితం తండ్రి, ఇప్పుడు తల్లి మరణించడంతో వారు అనాధలుగా మారారని కుటుంబ సభ్యులు బంధువులు రోదిస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని పిల్లలను ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే బిఎల్ఆర్ పరామర్శ :- అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహిస్తున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ ), డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు దీరావత్ స్కైలాబ్ నాయక్ లు పిడుగుపాటు గురై నాగమణి మృతి చెందటం సమాచారం అందుకోగానే హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు.
అధికారులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు,బిఎల్ఆర్ బ్రదర్స్ ఉన్నారు.

## ధర్మ సమాజ్ పార్టీ ప్లీనరీ కరపత్రం ఆవిష్కరణ

నాంపల్లి, అక్టోబర్,19(ప్రజా జ్యోతి): మండల కేంద్రంలో నవంబర్ 3వ తేదీన జరగబోయే ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్లీనరీ మహా సమ్మేళనం కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ



సందర్భంగా సుధాకర్ మహారాజ్ డిఎస్పీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం బడుగు బలహీన వర్గాల ప్రజల్ని ఎలా వాడుకుని పీడించారో ఇప్పుడు భారత రాజ్యాంగం వచ్చాక కూడా అదే విధంగా ప్రజల్ని పీడిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ గిరి మహారాజ్ మండల అధ్యక్షుడు సుధాకర్ మహారాజ్ , మండల ఉపాధ్యక్షులు గిరి రావణ్ , చిరంజీవి మహారాజ్, ప్రధాన కార్యదర్శి నరేందర్ మహారాజ్ లు మండల కార్యదర్శులు రాజు మహారాజ్ , రమేష్,శివ, స్వామి,గిరి, యాదయ్య,వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## చిమిర్యాలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 19, (ప్రజాజ్యోతి) : ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎంతో ఉపయోగపడుతున్నాయని చిమిర్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు దోనూరు జైపాల్ రెడ్డి అన్నారు. సంస్థాన్



నారాయణపురం మండలం, చిమిర్యాల గ్రామంలో శనివారం సుర్వి భాస్కర్ కు 10,500 చెక్కు, దండుగుల శ్రీనివాస్ కు 21 వేల రూపాయల చెక్కులను జైపాల్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇది పేదలకు గొప్ప వరం లాంటిదని కొని ఆడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కేసాని రాజు, నాయకులు సుర్వి రాజు, కేసాన్ని దిలీప్, వర్కాల శ్రీకాంత్, సుర్వి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోనూ వివిధ గ్రామాలకు చెందిన వారికి ఎనిమిది లక్షల 54 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కరెంటు శ్రీనివాస్ నాయక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

యాదాద్రి(వలిగొండ)అక్టోబర్ 19(ప్రజాజ్యోతి న్యూస్): వలిగొండ పట్టణానికి చెందిన గుంజ చిన్న నరసింహ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు ఐటిపాముల రవీంద్ర పరామర్శించి వారికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



ఈ కార్యక్రమంలో రచ్చ శ్రీను, రాచమల్ల తిరుపతయ్య, గొలుసుల దుర్గ, పిట్టల శంకర్, నాగేల్లి కృష్ణ, గొలుసుల కనకయ్య, గుంజ మహేష్, వరికుప్పల మురళి తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మిక పోరాటయోధుడు ధర్మ బిక్షం

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 19, (ప్రజాజ్యోతి) : గీత కార్మికుల కోసం నిరంతరం పోరాడిన యోధుడు దిగవంగత ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షమని గీతా పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్ అన్నారు. కల్లుగీత కార్మికుల కోసం ధర్మభిక్షం 67 ఏళ్ల క్రితం గీతా పనివారల సంఘాన్ని స్థాపించాడన్నారు. సంఘాన్ని స్థాపించి 67 ఏళ్లు అయినా సందర్భంగా శనివారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ధర్మ బిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న కల్లుగీతా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్మ భిక్షం అనేక పోరాటాలు నిర్వహించాడని తెలిపారు. గీసే వాడికే చెట్టు అనే నినాదంతో కార్మికులలో చైతన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వాలతో పోరాటం జరిపాడన్నారు. ధర్మవీక్షం చేసిన పోరాటాల ఫలితంగానే దేశవ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు గుర్తింపు వచ్చిందని, 560 నెంబర్ జీవో వచ్చిందని తెలిపారు. ఈ జీవోతో కల్లుగీత కార్మికులకు సొసైటీలు ఏర్పాటు చేయడం, ప్రమాదంలో చనిపోతే ఎక్స్గ్రేషియా లు చెల్లించడం, వనాలను పెంచడం వంటి హక్కులను కార్మికులు సాధించుకున్నారని పందుల యాదగిరి గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోగదాల సత్తయ్య, పాలకొర్ల యాదయ్య,



వీరమల్ల యాదయ్య, బద్దం యాదయ్య, నీళ్ల గాలయ్య, సుర్వి నరసింహ ,సుర్వి ముత్యాలు, పెద్దగోని విష్ణు, బద్దం బాలరాజు, బొడిగె బిక్షం, చెదరపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు... ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

### జాతీయ వాదులకు మద్దతుగా నిలవాలి

### కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టిపియూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుర్ల సాయిరెడ్డి

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): 2025 మార్చిలో జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజక వర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ఉపాధ్యాయులు తమ ఓటును వెంటనే నమోదు చేసుకోవాలని ఏపీ యూఎస్, టి పి యు ఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తికుల్ల సాయి రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. శనివారం ఆలేరు పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఆన్లైన్లో, ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకొనుటకు దరఖాస్తు ఫారం 19, సర్వీస్ సర్టిఫికెట్పై ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ సంతకం చేసిన కాపీ, ఓటరు ఐడి, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో తో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. 2019లో ఉన్న ఓటరు జాబితా రద్దయినందున ప్రతి ఒక్కరు మళ్ళీ నమోదు చేసుకోవాలని అన్నారు. నవంబర్ ఆరవ తేదీ వరకు గడువున్న వెంటనే నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత మార్చిలో ఉద్యోగ విరమణ పొందిన వారు కూడా తమ ఓటును నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రస్తుత విద్యారంగా, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించబడాలంటే ప్రభుత్వ పాఠశాలలో కాపాడబడాలంటే జాతీయవాదులకు అండగా నిలిచి కౌన్సిలకు పంపాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ బాధ్యులు దూడల వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు దాసరి మంజుల, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర స్వామి, సైదులు, మేఘరాజు, రేష్మ, సత్యనారాయణ, పరమేష్, మల్లేశం, రోహిణి, రాధిక, హేమలత, నాన్న ప్రసన్న, సుజా రాణి, శ్రీధర్, శంకర్ రెడ్డి తదితరులున్నారు.



# సాగులో ఉన్న ప్రతి రైతుకు పట్టాలిప్పిస్తాం... చివరి ఎకరాకు సాగునీరు అందిస్తాం...!

### – అడవిదేవులపల్లి ప్రజా పాలన సభలో ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, అక్టోబర్ 19,( ప్రజాజ్యోతి ): కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వమని సాగులో ఉన్న ప్రతి రైతుకు పట్టాలు అందజేస్తామని, చివరి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ ) అన్నారు. శనివారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ప్రజా పాలన మండల సభ నిర్వహించారు.ప్రజాపాలనలో సేకరించిన దరఖాస్తులపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అడవిదేవులపల్లి మండలంలో అత్యధికంగా రైతులు పోడు వ్యవసాయం, ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటూ ఏళ్ల తరబడి ఉంటున్నారని ఇప్పటివరకు వారికి గత ప్రభుత్వం పట్టాలు అందజేయలేదని, భూమాత పైలెట్ ప్రాజెక్టు ద్వారా సాగులో ఉన్న ప్రతి రైతుకు పట్టాలు అందజేసేలా కృషి చేస్తానని అన్నారు.చివరి భూములకు సాగునీరు అందించేందుకు దున్నపోతుల గండి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,డిసిసి అధ్యక్షుడు కేతవత్ శంకర్ నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ధీరావత్ స్కైలాబ్ నాయక్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్,మండల పార్టీ అధ్యక్షుడు బాలు నాయక్,కాంగ్రెస్ నాయకులు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.





ప్రజాజ్యోతి
ఆదివారం, 20 అక్టోబర్ 2024

## ధాన్యం కొనుగోలు ప్రారంభమయేనా?..

### రైతులకు తప్పని తిప్పలు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి)
రైతులు ధాన్యం మార్కెట్ సెంటర్లో పోసి 20 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభానికె పరిమితం చేశారని సిపిఎం




మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ప్రసాదం విష్ణు అన్నారు. శనివారం రోజున సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 70 శాతం వరకు పూర్తిగా వరి ధాన్యాన్ని తీసుకువచ్చి మార్కెట్ యార్డులో పోసినారని పోసిన ధాన్యానికే ఇప్పటికే మార్కెట్ యార్డులు పూర్తిగా ధాన్యంతో నిండిపోయాయని అన్నారు. ఇంకా 30శాతం వరి ధాన్యం తీసుకువస్తే పోసేందుకు వీలు లేకుండా మార్కెట్ యార్డులు నిండిపోయాయని వెంటనే అధికారులు స్పందించి మార్కెట్ యార్డులో ఉన్న దాన్ని వెంటనే కొనుగోలును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థలం లేక తెచ్చిన ధాన్యాన్ని మొత్తం తక్కువ రేటుకు రైస్ మిల్లర్లకు రైతులు అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మార్కెట్ యార్డులో పోసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు క్లియర్ చేయాలి...!

### – మిర్యాలగూడ సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, అక్టోబర్ 19,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ పథకం కింద ప్లాట్ల రెగ్యులరైజ్ కోసం అందిన



దరఖాస్తులను వారం రోజుల్లో క్లియర్ చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. శనివారం మిర్యాలగూడ లోని స్థానిక తన కార్యాలయంలో పది మండలాల ఎల్ ఆర్ ఎస్ టీం సభ్యులైన డీఎల్పీఓ, ఎంపీడీఓ, ఏఈ, ఆర్ఐ, సెక్రటరీ, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా అందిన దరఖాస్తుదారుల సమాచారం సేకరించి వారి ప్లాట్లను రెగ్యులర్ చేసి ప్రభుత్వనికి చెల్లించాల్సిన రుసుము తెలియ పర్చాలని పేర్కొన్నారు. వారం రోజుల్లోగా పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ మండలాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాము రాజీవ్ కు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మహిళ పట్టణ అధ్యక్షురాలు పాము అనిత మామ పాము రాజీవ్ అకాల మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. శనివారం ఆలేరు పట్టణం భరత్ నగర్ కాలనీలోని రాజీవ్ పార్థివ దేహానికి పూలమాలు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం ఏజాజ్, ఒకటో వార్డు కౌన్సిల్ చింతల పని శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లెల శ్రీకాంత్, నాయకులు అంగడి ఆంజనేయులు, జట్ట సిద్ధులు, ద్వారపు శంకర్, చిక్క శ్రావణ్, ఆలేటి అనిల్, మెరుగు శ్రీజ తదితరులు ఉన్నారు.



## లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలలంటూ ఈనెల 21న సీఎం ఇల్లు ముట్టడి

### – గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ కోటియా నాయక్

మిర్యాలగూడ, అక్టోబర్ 19,( ప్రజాజ్యోతి ):
తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగినటువంటి లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ కోటియా నాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం




మిర్యాలగూడలో అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతూ ఈనెల 21వ తారీఖున రేవంత్ రెడ్డి ఇంటి ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన హక్కులకై పోరాటం చేస్తామని, అదేవిధంగా గోర్ బోలి భాషను గుర్తించాలని, పంచాయతీలుగా మారిన తండాలను రెవిన్యూ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్ నాయక్,రవీందర్ నాయక్,రామారావు నాయక్, రాజు నాయక్,బాలాజీ నాయక్, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-రైతు భరోసా ఎగువేతపై నిరసన.**
**-రైతుల పక్షాన నిలబడ్డ ఏకైక పార్టీ బి. ఆర్. ఎస్.**
**-మునగాల మండల టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తొగరు రమేష్.**

మునగాల అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి):
రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా నేడు మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు మునగాల మండల టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ ఒక ప్రకటనలు తెలిపారు. ఎకరానికి 15వేల రూపాయల చొప్పున రైతు భరోసా అందిస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పాలనలను ఎండగట్టాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పిలుపుమేరకు, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, రైతులు, సానుభూతిపరులు, టిఆర్ఎస్ పార్టీ అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.



## సీనియర్ సివిల్ జడ్జి గా డాక్టర్ సూర సుమలత కు ప్రమోషన్

### కృతజ్ఞతలతో పలువురి ఘన సత్కార వీడ్కోలు..

రాజాపేట ,అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి )
ఆలేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా మూడు సంవత్సరాల కాలం పాటు నిర్విరామ సేవలందించిన డాక్టర్ సూర సుమలత సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్ పొంది బదిలీ కామారెడ్డి కోర్టు కు రిలీవ్



అయిన సందర్భంగా పలువురు కృతజ్ఞతలతో అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.గత 18 అక్టోబర్ 2021 వ తేదీ ఆలేరు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సూర సుమలత ఈనెల 18వ తేదీ సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్ పొందారు. మూడు సంవత్సరాల కాలం పాటు సేవలందించిన జడ్జి కీ బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది, పోలీసులు పలువురు పూలమాలలు పుష్పగుచ్ఛాలు శాలువలు జ్ఞాపకాలతో సత్కరించి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జడ్జి , డాక్టర్ సూర సుమలత మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాలం పాటు తనపై చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివని, తన బాధ్యతలను నిజాయితీగా, నిర్భయంగా, నిబద్ధతతో నిర్వర్తించడానికి సహకరించిన బార్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు చెప్పారు.

## ఎస్ ఏ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): రానున్న ఎస్ఏ వన్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయవలసినదిగా విద్యార్థుల తల్లిదండ్రులకు టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధిరాలు కే రమాదేవి సూచించారు. శనివారం ఆలేరు మండలం టంగుటూరు




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ రానున్న పరీక్షలలో విద్యార్థులను సన్నద్ధం చేయవలసిన అవసరం తల్లిదండ్రులకు ఉందని అన్నారు. విద్యార్థుల ఐడి కార్డు అపార్ గురించి కల్పించడం అయినది. పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలన్న ఉద్దేశంతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు పాడి గేదె మృతి

తుంగతుర్తి అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి)
పిడుగుపాటుకు పాడి గేదే మృత్యువాత పడ్డ ఘటన మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. తాడూరు సోమయ్య తన పాడి గేదెను తన ఇంటి సమీపంలో ఉన్న చెట్టుకు కట్టేశారు.శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం రావడంతో ఆ చెట్టు వద్ద పిడుగు పడి పాడి గేదే అక్కడికక్కడే మృతి చెందింది. రైతుకు జీవనాధారమైన పాడి గేదే మృతి చెందడంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గేదె మృతితో 70 వేల రూపాయలకు పైగా నష్టం వచ్చిందని ప్రభుత్వం ఆదుకోవాలని రాములు కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.



## ఉపాధ్యాయులకు వీడ్కోలు

ఆలేరు, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి): ఆలేరు మండలం సాయి గూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీల భాగంగా ఇతర పాఠశాలకు వెళ్తున్న మహ్మద్ బాసిత్, హుస్సేన్, లక్ష్మణాచారి ఉపాధ్యాయులకు అమ్మ



ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు ఇరువురు ఉపాధ్యాయులను పూలమాలతో, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ బొడ్డు కవిత, ఉపాధ్యాయులు రాణి, పాల సెంటర్ చైర్మన్ ఊదరి రాములు, గ్రామ పెద్దలు బైరి నరసయ్య గౌడ్, కట్టే గుమ్ముల సిద్దారెడ్డి, బొడ్డు సత్తయ్య, గ్రామ యువజన సభ్యులు బైరి మహేందర్ గౌడ్, మహమ్మద్ అబ్బాస్, డాన్స్ మాస్టర్ సంఘీ వేణు, గంగాధరి మహేందర్, చింతకింది ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## బదిలీ పై వెళ్లిన మండల విద్యాధికారికి ఘన సన్మానం

నాంపల్లి,అక్టోబర్,19(ప్రజా జ్యోతి): గతంలో నాంపల్లి మండల



విద్యాధికారిగా పనిచేసి ఇటీవలే బదిలీపై వెళ్లిన ఎలికట్టే గుర్వారావు ని శనివారం మండల కేంద్రంలోని స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో జాతీయ అంబేద్కర్ యువ కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు గాలెంక గురుపాదం, ప్రస్తుత నాంపల్లి మండల విద్యాధికారి మల్లికార్జునరావు,నాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్ తో కలిసి తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోరే సాయిరాం పూలమాలవేసి శాలువాతో సన్మానించడం జరిగింది.

## నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

హాలియా,అక్టోబర్19(ప్రజా జ్యోతి) : ఫర్టిలైజర్స్ షాపుల్లో నకిలీ ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హాలియా



డివిజన్ అధికారి వెంకట రవీందర్ తెలిపారు.శనివారం ఎ ే శ లి య ే గా ప ట్ట ణ ం లో ని ఫర్టిలైజర్స్ షాపుల్లో అనుముల మండల వ్యవసాయ అధికారి యం.సరిత తో కలిసి త ే ని ఖీ ల ు నిర్వహించారు.ఈ సందర్భంగా డీలర్స్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు,ఇన్ వాయిస్ ను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయాలు చేపట్టాలని సూచించారు.పురుగు మందులు, ఎరువులు విక్రయించిన రైతులకు రసీదు ఇవ్వాలని చెప్పారు.స్టాక్ వివరాలను ప్రతిరోజు దుకాణం ముందు నోటీస్ బోర్డులో ఉంచాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు చేపట్టినట్లయితే అట్టి షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రభుత్వం 6 గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయాలి

### మోరిగాడి రమేష్ సిపిఎం నాయకులు

శుక్రవారం రోజున ఆలేరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శివాలయం వీధిలోని సబ్ శాక మహాసభ జరిగింది ఈ సందర్భంగా మోడీగారి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను పూర్తిగా అమలు చేయాలని అన్నారు రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడం వలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని రుణమాఫీ జరిగినప్పటికీ బ్యాంకర్లు రైతులకు కొత్త రుణాలు ఇవ్వకుండా వేధింపుల గురి చేస్తున్నారని రైతులు ప్రతినిత్యం ఆలేరు పట్టణంలో ఉన్నటువంటి బ్యాంకు ల చుట్టూ తిరుగుతున్నారని బ్యాంకుల వద్ద ఏ రైతులు కదిలించిన వేల రూపాయలు ఖర్చు పెట్టుకొని వారాల కొద్ది బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నామని మాకు బ్యాంకులు లోన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి రైతులకు కొత్త రుణాలు ఇచ్చే విధంగా బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన సందర్భంగా డిమాండ్ చేశారు. ఈనెల 21న ఆలేరు పట్టణం వై ఎస్ ఎన్ గార్డెన్లో జరిగే పట్టణ మహాసభను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు జరిగిన మహాసభలో సీనియర్ నాయకులు వడ్డేమాన్ బాలరాజు గారిని ఏకగ్రీవంగా కార్యదర్శిగా ఎన్నుకున్నారు ఈ




కార్యక్రమంలో ఘనగాని మల్లేశం కాసుల నరేష్ ఎండి మతిన్ ఎండి ఖలీల్ ఎండి అఖిల్ గొడుగు దాసు మోరిగాడి పృథ్వి తదితరులు పాల్గొన్నారు

# రైతు భరోసా విడుదల చెయ్యకుండా మాటతప్పిన ప్రభుత్వం

### – తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ, అక్టోబర్ 19,( ప్రజాజ్యోతి ):



తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు 7500 రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు.శనివారం స్థానికంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు అందించే ఆర్థిక సాయం ఎకరాకు 5000 నుండి 7500 ఇస్తామని ప్రకటించి ప్రభుత్వం ఏర్పాటు అయి 9 నెలలు గడిచినప్పటికీ నేటికి రైతుకి ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో వేయకుండా మాట తప్పిందన్నారు. భరోసా అందక రైతులు తీవ్ర ఆందోళనలో చెందుతున్నారని అన్నారు. ఎంతోమంది రైతులు రైతు భరోసా నిధులు అందకపోవడంతో అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని, కొంతమంది రైతులు అప్పుల బాధతో ప్రాణాలు సైతం తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రైతుల సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా తక్షణమే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రవెల్లి గంగాధర్, రాయించు నరసింహ, చిలకల మురళి యాదవ్, మహేశ్వర నరేష్, శైలేందర్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

### – గ్రామీణ ప్రాంత విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దాలి

### – వరకాంతం జంగారెడ్డి

చౌటుప్పల్ అక్టోబర్ 19 ( ప్రజా జ్యోతి ) ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన లభిస్తున్నదని శ్రీ ఆది మహా విష్ణు దేవాలయ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి అన్నారు.శనివారం దేవలమ్మ నాగారం గ్రామ పంచాయతీ అవరణంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా శ్రీ ఆది మహా విష్ణు దేవాలయం చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, ఎంఈఓ గురువా రావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరకాంతం జంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారుచేసి పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తయారు చేయడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు



విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసిన.దాత మహేందర్ గౌడ్

రాజపేట, అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి)

రాజపేట మండలంలోని నమిల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరికీ దాత వేముల మహేందర్ గౌడ్ ప్లేట్లు గ్లాసులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు నమిల భరత్ కుమార్ గౌడ్ అధ్యక్షతన పాఠశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో దాత వేముల మహేందర్ గౌడ్ ప్లేట్లు గ్లాసులు అందజేయగా తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులు భరత్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయురాలు మమత తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి

నార్కట్ పల్లి అక్టోబర్ 19( ప్రజా జ్యోతి) రాష్ట్రంలో గురుకుల, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, అద్దె భవనాల్లో నడపడం వల్ల యాజమాన్లు కిరాయి చెల్లించకపోవడంతో హాస్టలను కాలి చేయించి పిల్లలను బయటకు పంపించి గేట్లకు తాళాలు వేసే పరిస్థితి ఏర్పడిందని దీనివలన చదువుకునే పిల్లలు మనోభావాలు దెబ్బ తినకుండా తక్షణమే సొంత భవనం ఏర్పాటు చేయాలని



కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు దండు రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గత ఆరు నెలల నుండి మెసేజ్ చార్జింగ్ పెంచలేదని, పాత మెనూనె అమలవుతుందని కాస్మోటిక్ చార్జీలను కూడా చెల్లించడం లేదని ఆయన తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి పేద విద్యార్థికి 25 వందల మిస్ చార్జీలను అందజేయాలని ఆయన కోరారు. చాలీచాలని మెస్ చార్జీల కారణంగా కుళ్ళిపోయిన కూరగాయలు, పప్పులు, నాసిరకమైన నీళ్ల చారు పిల్లలకు పెట్టడం వల్ల అన్నా ఆరోగ్య కారణంగా దెబ్బతిని ఆసుపత్రిలో ఫాలో అవుతున్నారని ఆయన తెలిపారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో ఉంటే గురుకులాల్లో సొంత భవనాలు నిర్మించడంతో పాటు అన్ని సదుపాయాలు కల్పించి వారి భవిష్యత్తును తీర్చడానికి చొరవ తీసుకోవాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏపిఎం సౌజన్య

మఠంపల్లి అక్టోబర్ 18 ప్రజాజ్యోతి: మండలంలోని వర్ధపురం,భీల్య నాయక్ తండ గ్రామలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఏపిఎం సౌజన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా





ఏపీఎం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి గ్రామంలో ఐకెపి కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం జరిగేలా చేస్తున్న ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని గ్రేడ్ ఏ వన్ ధాన్యానికి 2320 సాధారణ ధాన్యానికి 2,300 మద్దతు పాటు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు బచ్చలకూరి బాబు,మాజీ జెడ్పిటిసి జగన్,కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు నాగు నాయక్,సీసీలు విజయ్,నరసయ్య,రైతులు,సమాభావన సంగం సభ్యులు పాల్గొన్నారు.

## వరికోత మిషన్ ప్రారంభించిన వట్టె జానయ్య

పెన్ పహాడ్ అక్టోబర్ 19(ప్రజాజ్యోతి): మండల పరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన ఆవుల కనకయ్య నూతన హార్వెస్టర్ (కోత మిషన్) కొనంగోలం చేశారు. హార్వెస్టర్ ప్రారంబమానికి ఉమ్మడి నల్గొండ



జిల్లా మాజీ %ఐ.జ.వీ.ా% చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ ను ఆహ్వానించగా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మోదుగు నర్సిరెడ్డి,వరికల్లు సైదులు, జాల నాగరాజు,వేణు,విష్ణు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వేతనాలు పెంచాలి

–రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్.

–సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు.

మునగాల అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి): నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నందున కార్మికుల కొనుగోలు శక్తి పడిపోతున్నందున ప్రభుత్వం వెంటనే నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రించాలని, అదేవిధంగా కార్మికుల వేతనాలను పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం మునగాల మండల కేంద్రంలో అమరవీరుల స్మారక భవనం నందు అనంతు మైసయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, అదేవిధంగా కార్మికుల వేతనాలు పెంచాలని, క్రింది స్థాయిలో వేధింపులు ఆపాలని, దీర్ఘకాలికంగా గ్రామపంచాయతీ కార్మికులు అనేక పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోయినందున నవంబర్ 5 ,6 తేదీలలో దీక్షలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మిస్ చార్జీలు పెంచాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన అన్నారు. అదేవిధంగా ఎగుమతి ,దిగుమతి రవాణా చేయడంలో హమాలి ట్రాన్స్పోర్ట్ కార్మికులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని వారికి ఆర్థిక, ఆరోగ్య భద్రత లేదని, వారికి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కొత్త కార్డులకు అవకాశం



కల్పించాలని, పెండింగ్లో ఉన్న క్లైమూలను పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిఐటి జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, డి. నాగరాజు ,ఎన్. శేఖర్, కె .వీరబాబు, నాగార్జున, సత్యనారాయణ, కోటయ్య, రామకోటి, సిహెచ్. లింగయ్య, ఎస్. నాగరాజు, షేక్ నబీ సాహెబ్, ఎం. వెంకన్న, సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ఐ బండ సోమయ్య కు ఎస్సైగా పదోన్నతి

యాదాద్రి భువనగిరి అక్టోబర్ 19(ప్రజా జ్యోతి) గుండాల మండల కేంద్రంలో సీతారాంపురం గ్రామ వాసి అయినటువంటి బండ సోమయ్య గతంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేసి న గుండాల మండలం



సీతారాంపురం గ్రామానికి చెందిన బండ చంద్రయ్య బీరమ్మల కుమారుడు సోమయ్య అతను చిన్నతనం నుండి ఎంతో కష్టపడి చదువుకొని ఉన్నంత మైన స్థానంలో ఉండడానికి ఎంతో కష్టపడి తల్లిదండ్రుల ప్రోత్బలంతో ఈరోజు ఇంతటి ఘన కీర్తిని సంపాదించాడు అలాంటి వ్యక్తి అయినటువంటి అతను మొదటిసారి పోలీసుగా అడుగుపెట్టిన సంవత్సరం 1989 బ్యాచ్ కు చెందినటువంటి తనకు ఎస్సైగా ప్రమోషన్ రావడం తన తోటి మిత్రులు ఎంతగానో సంబరపడ్డారు తాను నిరుపేద కుటుంబంలో పుట్టి ఒకటి నుండి పది వరకు సీతారాంపురం గవర్నమెంట్ బడిలో చదువుకొని అక్కడినుండి తను ఎన్నో ఆటుపోటులు ఎదుర్కొని ఈరోజు ఏఎస్ఐ గా భువనగిరి అట్లాగే కీసర మండలంలోపదవీ బాధ్యతలు నిర్వర్తించి అక్కడనుండి ఎస్సై గా పదోన్నతి పొందారు.

వారికి ఇలాంటి పదోన్నతులు మరెన్నో పొందాలని పొంది గ్రామ ప్రజలకు రాష్ట్ర ప్రజలకు తను ఎంతో సేవ చేయాలని గ్రామస్తులు మిత్రులు శ్రేయోభిలాషులు చిన్ననాటి మిత్రులు అందరూ మనసారా కోరుకుంటూ వారికి ఎస్సైగా ప్రమోషన్ రావడం శుభ సూచకం అందులో భాగంగా చిన్ననాటి మిత్రులు మరియు అందరూ తనకు ఘనసన్మాన కార్యక్రమం నిర్వహించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది ఎంఎ రహీం పాల్గొని మాట్లాడుతూ తోటి మిత్రునికి ప్రమోషన్ రావడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని అన్నారు. తోటి మిత్రులు టీచర్ కేమిడి సోమయ్య, కంట్రోలర్ మేకల పుల్లయ్య, కొప్పురి మల్లారెడ్డి, కప్పురి యాదిరెడ్డి, చిలుకూరి మోహన్, పాలడుగు కిష్టయ్య, మారోజు సోమలింగా చారి, బత్తిని సోమయ్య, చిలుకూరు చక్రపాణి,కేమిడి శ్రీనివాస్, వనమోజు శ్రీధర్, బత్తిని వెంకన్న, బొడిగి రవి. అట్లాగే గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## పదోన్నతిపై వెళుతున్న జడ్జి కి ఘనంగా వీడ్కోలు

కోదాడ టౌన్ అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి) సూర్యాపేట జిల్లా కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గా పని చేస్తున్న జడ్జి శ్యాం సుందర్ కు ఇటీవల సీనియర్ సివిల్ జడ్జి గా పదోన్నతి లభించింది. ఆయన్ను భువనగిరి లో సీనియర్ సివిల్ జడ్జి గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్బంగా ఆయన్ను శనివారం కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ ఆర్ కే మూర్తి మాట్లాడుతూ కోదాడలో మూడు సంవత్సరాల పాటు న్యాయమూర్తి గా పని చేసి అందరి అభిమానాన్ని చూరగొన్నారని ప్రశంసించారు. కక్షిదారులకు





కౌన్సెలింగ్ చేస్తూ కేసు ల పరిష్కారంలో చొరవ చూపించారని అన్నారు. ఆయనకు పదోన్నతి లభించడం హర్షణీయం అని, భవిష్యత్తులో ఆయన మరిన్ని పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, కార్యవర్గం కోడూరు వెంకటేశ్వర రావు, మంద వెంకటేశ్వర్లు, హనుమంతు రాజు, హేమలత, దొడ్డ శ్రీధర్, నవీన్, సీనియర్ న్యాయవాదులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, వెజెల్ల రంగారావు, కాకర్ల వెంకటేశ్వర రావు, రామిషెట్టి రామకృష్ణ, పాలే టీ నాగేశ్వర రావు, రమజాన్ పాషా, సాధు శరత్ బాబు, తమ్మినేని హనుమంతు రావు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు వర్క్ షాప్

కోదాడ టౌన్ అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి) స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు సిఎస్సి రెండవ సంవత్సర విద్యార్థులకు ప్రోగ్రామింగ్ సి మరియు డేటా స్ట్రక్చర్ అనే అంశాలపై మూడు రోజులపాటు వర్క్ షాపు నిర్వహించడం . ఈ వర్క్ షాప్ కి రిసోర్స్ పర్సన్ గా నరేందర్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు ప్రోగ్రమించి డేటా స్ట్రక్చర్ అనే అంశాలపై మూడు రోజులపాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సి ప్రోగ్రాం డేటా స్ట్రక్చర్ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని చెప్పడం జరిగింది .ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ నాగార్జున రావు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి గాంధీ విభాగాధిపతిరాలైనటువంటి స్రవంతి విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫ్యాన్ కు ఉరేసుకొని వ్యక్తి మృతి..

నాంపల్లి,అక్టోబర్,19(ప్రజా జ్యోతి): ఫ్యాన్ కు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం స్థానిక పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలకు ప్రకారం...బాపూజీ నగర్, కొండమల్లేపల్లి మండలానికి చెందిన దేరంగుల యాదగిరి తండ్రి లక్ష్మయ్య, వయస్సు: 40, కులం వడ్డెర, వృత్తి: కూలి అనునతడు గత 20 రోజుల క్రితం కూలి పనుల నిమిత్తం కుటుంబంతో సహా నాంపల్లి గ్రామానికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొంత కాలం నుండి భార్య భర్తల మధ్య మనస్పర్ధాలు కలవు. అదే విధంగా ఈ నెల 18న యాదగిరి అతని భార్య రజిత తో గొడవ పడగా,ఆమె తన ఇద్దరు పిల్లలు మరియు రజిత వాళ్ళ అమ్మ పార్వతమ్మ అందరూ కలిసి పత్తి ఏరడానికి చండూర్ మండలం గొల్లగూడ గ్రామానికి వెళ్ళినారు.తిరిగి సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చి చూసే సరికి దేరంగుల యాదగిరి చీరతో శ్లాబుకు ఉండే ఫ్యాన్ కొక్కానికి ఉరి వేసుకొని మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని యాదయ్య కుటుంబ సభ్యులకు అప్పగించారు.మృతి చెందిన వ్యక్తి సోదరుడు అయిన దేరంగుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై మొగుళ్ళ శోభన్ బాబు తెలిపారు.

## రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ: ప్రజా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్

రాజాపేట, అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని మరో సారి మోసం చేసిందాన్ని ప్రజా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్



అన్నారు.శనివారం రాజపేట విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలు రైతాంగానికి కన్నీరు కారించేలా ఉన్నాయన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తె రైతు భరోసా పథకం కింద ఏడాదికి 15 వేలు ఇస్తానన్న హామీని తుంగలో తొక్కిందన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వానాకాలం పంటకు రైతు భరోసా లేదనడం బాధాకరం అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 10 నెలలు గడిచినా రైతాంగాన్నికి ఇచ్చిన హామీలను నేటికీ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు.వానాకాలం పంట కోసం రైతులు అప్పుల తెచ్చి పెట్టుబడి పెట్టారన్నారు.మరో ప్రక్క రుణమాఫీ కూడా నేటికీ సగం మంది రైతాంగానికి పూర్తి కాలేదన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. వానకాలం పంట పెట్టుబడి సహాయం రైతు భరోసాను రైతుల ఖాతాలో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ప్రజా పార్టీ రైతుల పక్షాన నిలబడి ఎప్పుటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదిస్తుందన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనను ఖండిస్తూ రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం అంతా రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేయాలని ప్రజా పార్టీ పిలుపునిస్తుందన్నారు.

## విచ్చలవిడిగా చెలరేగుతున్న పత్తి బ్లాక్ దంద దళారులు..

-బాట్లతోనే కాదు రాళ్లతో కూడా జోకొచ్చు..
-రైతులను మోసం చేస్తున్న పత్తి దళారులు
-కన్నెత్తైనా చూడని సివిల్ సప్లై దళారులు
-రైతన్న గోడు దేశానికే కీడు



నాంపల్లి,అక్టోబర్,19(ప్రజా జ్యోతి): మండలంలోని మోసపూరితంగా పత్తి వ్యాపారులు రైతులను అక్రమంగా దోచుకుంటున్నారు. నాంపల్లి మండలం అక్రమార్కులకు అడ్డాగా మారింది. రైతులను పత్తి వ్యాపారులు బాట్లలో రాళ్లు పెట్టి జోకుతున్నారు. ఇప్పటికే భారీ వర్షాలకు రైతు చాలా వరకు నష్టపోయాడు.వెళ్లిన కొద్ది గొప్ప పత్తి ఇందులో రాబందుల వలె బ్లాక్ దందా వ్యాపారులు కూడా ఇబ్బంది పెడుతుంటే దిక్కు తోచని స్థితిలో రైతులు ఆందోళన పడుతున్నారు.పంట నష్టం జరిగింది.వాళ్లు బాధలో ఉంటే ఈ వ్యాపారులు రైతులను పీక్కు తింటున్నారు.ఈ విషయంపై ఒక్క అధికారి కూడా అటువైపు మొగ్గు చూపడం లేదు. రైతు మన దేశానికి వెన్నుముక లాంటివాడు.కానీ ఆ రైతుకే న్యాయం జరగకపోతే ఇంకా ఎక్కడ న్యాయం జరుగుతుంది. ఈ విషయంపై అధికారులు స్పందించి తమకు న్యాయం చేకూర్చాలని రైతులు వెల్లడించారు.

## వైస్ చాన్సిలర్ కలిసిన ప్రవేట్ కళాశాలల యాజమాన్యం

ప్రజా జోతి ప్రతినిధి /నల్గొండ

మహాత్మా గాంధీ యూనివర్శిటీ వైస్ చాన్సిలర్ గా శనివారం ఖాజా అల్తాఫ్ వరుస్సేన్ నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎం -జి యు ఓ్జి, పి, జి ప్రవేట్



కళాశాలల అధ్యక్షుడు మారం. నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు మంట్లాడుతూ కళాశాలల యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రవేట్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.సూర్యనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షలు గింజల. రమణా రెడ్డి, యూనివర్శిటి ఈసీ మెంబెర్స్ డాఎం పి భాస్కరరావు, ప్రవీణ్ కుమార్, అంగయ్యగౌడ్, రాం మోహన్, ఆదిత్య సామ్యాట్, సత్యంగౌడ్, జానయ్య గౌడ్, యాదగిరి, నర్సింహారెడ్డి, శంకర్, కళాశాలల యాజమాన్యాలు,తదితరులు పాల్గొన్నారు.

## 7వ దశ (వాక్-ఇన్) ఈ నెల 30 వరకు అడ్మిషన్లు

ప్రజా జోతి ప్రతినిధి /నల్గొండ

ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ మరియు ఫ్రైవేట్ ఐ టి ఐ లలో మిగిలిన సీట్ల కొరకు ఈ నెల 18 నుండి 30 వరకు స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీచేసినట్లు నల్గొండ జిల్లా ఐ.టి.ఐ ల కన్వీనర్/ప్రిన్సిపాల్ శ్రీ ఎ. నర్సింహ్మ చారి ఒక ప్రకటనలో తెలపారు.ఇప్పటివరకు సీటు కేటాయించబడని ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30 ఉదయం 11-00 లోపు వెబ్ సైట్ లోవివరాలను నమోదు చేసుకోగలరు.ఇప్పటికే 1, 2, 3, 4,5 %డ% 6ఫీ ఓ లలోన మోదు చేసుకున్న వారు మళ్లిన మోదు చేయాలసిన అవసరం లేదు. నమోదు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా అప్లికేషన్ ప్రింటెడ్ కాపీ తో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో సీట్ కావలసిన ఐటి ఐ ల లో వాక్-ఇన్ అడ్మిషన్స్ కొరకు అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఐటి ఐ లలో ఈ నెల 30 వరకు భౌతికంగా హాజరు కావలని తెలిపారు. ఇట్టి సదవకాశమును వినియోగించుకోగలరు. వివరాలకు 9701111928 సంప్రదించగలరు.గమనిక: 1, 2, 3, 4, 5 %డ% 6 ఫీ జై లలో సీటు కేటాయించ బడిన అభ్యర్థులకు అవకాశం లేదు.

## యూనివర్సిటీలకు వి సి లను నియమించడం అభినందనీయం...

మోతె అక్టోబర్ 19( ప్రజా జ్యోతి )

యూనివర్సిటీలకు విసిలను నియమించడంతో యువకులు విద్యార్థులు ఆనందంలో మునిగారు...ఎంతో ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి నూతన విసిగా పదవి బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కుమార్ సార్ గారికి మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెస్ఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఉస్మానియా యూనివర్సిటీలోని అనేక అడ్మినిస్ట్రేషన్ పోస్టులను సమర్ధవంతంగా నిర్వర్తించిన అనుభవం ఉన్న ప్రొఫెసర్ కుమార్ సార్ అని,వందేళ్ల పైబడిన చరిత్ర గల ఉస్మానియాకు మొదటిసారి ఒక మాదిగ బిడ్డ వైస్ ఛాన్సలర్ కావడాన్ని ఎంఎస్ఎఫ్ గా హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని పలు అంశాలను విసి దృష్టికి తీసుకెళ్లారు.శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెస్ ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, డాక్టర్ ఏర్రం నాగేంద్రమ్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి రఘువరన్ మాదిగ, వంగాల వెంకటేష్ మాదిగ, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఈదుల రాజీవ్ ప్రదీప్ మాదిగ, నాయకులు ప్రశాంత్ మాదిగ, మహేందర్ మాదిగ, విజయ్ మాదిగ, అంజి మాదిగ, రవి మాదిగ లింగం మొదలగు వారు పాల్గొన్నారు

## ఐకెపి కేంద్రాలను ప్రారంభించిన తాసిల్దార్.

మునగాల అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి):-

మునగాల మండలం నేలమర్రి మరియు నరసింహుల గూడెం గ్రామాలలో తాము పండించిన వరి ధాన్యాన్ని రైతులు అమ్ముకునే విధంగా తెలంగాణ



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలను మునగాల మండల తాసిల్దార్ వలిగొండ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, సిసి సత్యం, ఇన్చార్జి సిసి అశ్విని, ఏఈఓ, వివోఏఎస్ సునీత, నిర్మల, సంఘ బంధం అధ్యక్షురాలు మంగతాయారు, వి. వో. ఓ. బి మరియు రైతులు పాల్గొన్నారు.

## సాయి సభ్యుల సన్మానం

హాలియా,అక్టోబర్19(ప్రజా జ్యోతి) :

ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డిని హాలియా సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి



చంద్రశేఖర్ రెడ్డి డైరెక్టర్లు( ట్రేడర్లు)వీరమల్ల శ్రీనివాస్, చిట్టిప్రోలు యశ్వంత్ లను పూలమాలలతో శాలువా కప్పి సత్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ సాయి ఆశీస్సులతో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చిట్టిప్రోలు యాదగిరి,తేలప్రోలు శేఖర్ మిట్టపల్లి వాసులు,రేపాల వెంకన్న,సంతోష్,మంచుకొండ ప్రభాకర్,సురేష్,అరవింద్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం అందిస్తున్న చేప పిల్లలని సద్వినియోగం చేసుకోవాలి....

మోతె అక్టోబర్ 19 ( ప్రజా జ్యోతి )

ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లో చేపలు పెంచేందుకు అందిస్తున్న చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు సామ చిన్న వెంక రెడ్డి అన్నారు.శనివారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ కి ఎదురుగా ఉన్న తుమ్మల చెరువులో ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించిన చేప పిల్లలను వదిలి మాట్లాడారు.మండల పరిధిలో ఉన్న గ్రామాల చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న వాటిని ఆయా గ్రామాలకు చెందిన వారు తీసుకొని చెరువులు వదలాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దోసపాడు చిరంజీవి ఇండ్ల వెంకటేశ్వర్లు శ్రీకాంత్ బొక్క ఉపేందర్ రెడ్డి మచ్చ కార్మికులు పాల్గొన్నారు.



## జిల్లా గ్రంథాలయ సంస్థ కు చైర్మన్గా ఎన్నికైన వంగవీటి రామారావు కు ఘనంగా అభినందనలు

**చైర్మన్గా ఎన్నికైన వంగవీటి రామారావు అభినందనీయులు... మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్నేని బాబు**

**ఎర్నేని బాబు ఆధ్వర్యంలో వంగవీటి రామారావు కు ఘనంగా సన్మానం**

కోదాడ టౌన్ అక్టోబర్ 19 ( ప్రజా జ్యోతి)
సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్గా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ వంగవీటి రామారావు అభినందనీయులని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్నేని బాబు అన్నారు.





శనివారం కోదాడ పట్టణంలోని ఆయన నివాసంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్గా ఎన్నికైన వంగవీటి రామారావును ఘనంగా సన్మానించి మాట్లాడారు. గ్రంథాలయాల అభివృద్ధికి వంగవీటి శక్తి వంచన లేకుండా కృషి చేస్తారన్నారు వంగవీటి రామారావుకు చైర్మన్ పదవి అప్పగించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా రామారావును పూల మాలలు, శాలువ లతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంటి పులి వెంకటేష్, నెమ్మాది దేవమని, చందు నాగేశ్వరరావు, రావెళ్ల కృష్ణారావు, వేమూరి విద్యాసాగర్, సైదిబాబు ఎండి ఫాతిమా ఖాజా మొయినుద్దీన్, పారా వెంకటేశ్వర్లు, ఒంటి పులి శ్రీనివాస్, కందరబోయిన వేలాద్రి, మైలారి శెట్టి భాస్కర్, సుంకర నాగయ్య, లైటింగ్ ప్రసాద్ ,ముస్తఫా, మేకపోతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారించాలి: సిఐటియు జిల్లా నాయకులు యాకూబ్

గరిడేపల్లి అక్టోబర్ 19(ప్రజా జ్యోతి):
ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారించాలని సిఐటియు జిల్లా నాయకులు యాకూబ్ కోరారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కేంద్రంలో ఆటో కార్మికుల సమస్యలు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికులకు నెలకు పదివేలు ఇస్తామని హామీనిచ్చి 11 నెల అవుతున్న ఆటో



కార్మికులకు ఇంతవరకు ప్రభుత్వ సాయం అందలేదన్నారు.ఒక పక్క ప్రభుత్వం ఫ్రీ బస్సులు ఏర్పాటు,మరోపక్క ఆర్టిఓ అధికారులు ఓవర్ లోడ్ పేరుతో కేసు ఫైలు మరియు డీజిల్ రేటు పెరిగి అనేక సమస్యలు మూలాన ఆటో కార్మికులు ఫైనాన్స్ తెచ్చి ప్రతి నెల ఫైనాన్స్ కట్టలేక అధిక వడ్డీలకు తెచ్చి చివరికి ఆటోలు అమ్ముకొనే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.ఆటో కార్మికుల సమస్యలు నెరవేరుస్తూ,అర్హులైన కార్మికులకు ప్రభుత్వమే కొత్త ఆటోలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పొడిచేటి సైదులు, వాడపల్లి సంతోష్,చింతలచెరువు చంద్రయ్య,కే భాస్కర్,సంపత్ కుమార్,సారంగపాణి,ఎగ్బాల్ షేక్ ముస్తఫా,చిలకమర్రి చారి,జి.వెంకన్న, ఎస్కే ఇమామ్,ఆకుల కార్తీక్,కొమ్ము నగేష్,భద్రాచలం,సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతిపై వెళుతున్న జడ్జి కి ఘనంగా వీడ్కోలు

కోదాడ టౌన్ అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి)
సూర్యాపేట జిల్లా కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గా పని చేస్తున్న జడ్జి శ్యాం సుందర్ కు ఇటీవల సీనియర్ సివిల్ జడ్జి గా పదోన్నతి లభించింది.



ఆయన్ను భువనగిరి లో సీనియర్ సివిల్ జడ్జి గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన్ను శనివారం కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ ఆర్ కే మూర్తి మాట్లాడుతూ కోదాడలో మూడు సంవత్సరాల పాటు న్యాయమూర్తి గా పని చేసి అందరి అభిమానాన్ని చూరగొన్నారని ప్రశంసించారు. కక్షిదారులకు కౌన్సెలింగ్ చేస్తూ కేసు ల పరిష్కారంలో చొరవ చూపించారని అన్నారు. ఆయనకు పదోన్నతి లభించడం హర్షణీయం అని, భవిష్యత్తులో ఆయన మరిన్ని పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉ



పాధ్యక్షుడు గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, కార్యవర్గం కోదూరు వెంకటేశ్వర రావు, మంద వెంకటేశ్వర్లు, హనుమంతు రాజు, హేమలత, దొడ్డ శ్రీధర్, నవీన్, సీనియర్ న్యాయవాదులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, వెజెల్ల రంగారావు, కాకర్ల వెంకటేశ్వర రావు, రామిషెట్టి రామకృష్ణ, పాలే టీ నాగేశ్వర రావు, రమజాన్ పాషా, సాధు శరత్ బాబు, తమ్మినేని హనుమంతు రావు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగాన్ని మోసం చేస్తున్న పార్టీ కాంగ్రెస్

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలపై స్పందించిన బీఆర్ఎస్ నేతలు

పెన్ పహాడ్ అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి): తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని మరో సారి మోసం చేసిందని సూర్యాపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ వర్క్ షాప్ లో మాజీ మంత్రివర్యులు స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు . కార్యక్రమం అనంతరం, సోషల్ మీడియాలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడిన రైతులకు, రైతుభరోసా పథకం ప్రస్తుత పంటకు లేదనడంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను నెరవేర్చకుండా, హామీ చేయలేని 420 హామీలను ప్రజల ముందు పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కనీసం రైతు భరోసా పథకం కింద ఏడాదికి 15 వేలు ఇస్తానన్న హామీని తుంగలో తొక్కిందన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వానాకాలం పంటకు రైతు భరోసా లేదనడం బాధాకరం అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 10 నెలలు గడిచినా రైతాంగాన్నికి ఇచ్చిన హామీలను నేటికీ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు.వానాకాలం పంట కోసం రైతులు అప్పుల తెచ్చి పెట్టుబడి పెట్టారన్నారు.మరో ప్రక్క రుణమాఫీ కూడా నేటికీ సగం మంది రైతాంగానికి పూర్తి కాలేదన్నారు. వ్యవసాయ శాఖమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు.వానకాలం పంట పెట్టుబడి సహాయం రైతు భరోసాను రైతుల ఖాతాలో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ప్రజా పార్టీ రైతుల పక్షాన నిలబడి ఎప్పటికప్పుడు రాష్ట్ర



ప్రభుత్వాన్ని నిలదిస్తుందన్నారు. వ్యవసాయ మంత్రి చేసిన ప్రకటనను ఖండిస్తూ రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం అంతా రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేయాలని ప్రజా పార్టీ పిలుపునిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ నెమ్మది బిక్షం, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగేందర్, మాజీ ఎంపీటీసీలు జూలకంటి వెంకట్ రెడ్డి, బి జ్యోతి, మాజీ సర్పంచ్ లు, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో మరణించాడని బంధువుల పిర్యాదు

### పూడ్చి పెట్టిన శవాన్ని వెలికి తీసి శవ పరీక్ష

### అనుమానాస్పద మరణం కింద కేసు నమోదు చేసిన పోలీసులు

గరిడేపల్లి అక్టోబర్ 19(ప్రజా జ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మరణించాడని బంధువులు ఇచ్చిన పిర్యాదుతో పూడ్చిన శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేసిన సంఘటన శనివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో జరిగింది.స్థానిక ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం షేక్ దస్తగిరి(50) గత గురువారం తెల్లవారుఝామున అప్పుల భాధతో తన ఇంటిలో పెట్రోల్ పోసుకొని మరణించినాడని, తదుపరి అతని అంత్యక్రియలు వారి ఆచారం ప్రకారం అదే రోజు నిర్వహించారు.కాగా మృతుని బాబాయి కుమారుడు అయిన షేక్ సైదా మృతుని మరణం పై అనుమానం ఉన్నదని ధరఖాస్తు ఇవ్వడంతో యస్ఐ కేసు నమోదు చేసి,ఆయా సమాచారాన్ని తహశీల్దార్, హుజూర్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులకు తెలియపరిచి వారితో కలసి గానుగుబండ లోని మృతుడుని పాతిపెట్టిన స్థలం వద్దకు వెళ్ళి గ్రామపంచాయతి సిబ్బంది సహాయంతో అతని శవాన్ని వెలికి తీసి స్థానిక తహశీల్దార్ బండ కవిత సమక్షంలో మృతుని శవానికి శవ పంచనామా నిర్వహించిన అనంతరం హుజూర్ నగర్ ప్రభుత్వ డాక్టర్లు సునిల్, లోహిత లు పోస్ట్ మార్టం నిర్వహించిన తదుపరి శవాన్ని పూడ్చి పెట్టారు.దస్తగిరి మృతి పై కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేయడం జరుగుతుందని యస్ఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,కార్యదర్శి ఇంద్ర కుమార్,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## పి డి ఎస్ యు అర్థ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని

కోదాడ టౌన్ అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి)

కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 20న నిర్వహించనున్న పూర్వా ప్రస్తుత విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ పూర్వ విద్యార్థి నాయకులు రాయపూడి చిన్ని పందిరి నాగిరెడ్డిలు




పేర్కొన్నారు. శనివారం స్థానికైమిష్ కళాశాలలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.. ఆత్మీయ సమ్మేళనానికి పౌర హక్కుల ఉద్యమకారుడు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం ప్రధాన వక్తగా హాజరుకానున్నారని పేర్కొన్నారు జార్జిరెడ్డి అమరత్వంతో జంపాల చంద్రశేఖర్ శ్రీపాద శ్రీహరి రంగవల్లి మారోజు వీరన్న తదితర విద్యార్థుల ప్రేరణతో పిడిఎస్యు శాస్త్రీయ విద్యా విధానంతో పాటు సామాజిక సమస్యలపై పోరాడిందని పేర్కొన్నారు.. వామపక్ష ప్రజాతంత్ర ప్రజాస్వామిక వాదులు హాజరై ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.. ఈ సమావేశంలో పి డి ఎస్ యు ప్రస్తుత విద్యార్థులు రాఘవరెడ్డి అప్పి రెడ్డి నరసింహారావు ఉదయగిరి హరి కిషన్ రావు చంద్రరావు ఉ దయ్ పులి రాకి. వేణు తదితరులు పాల్గొన్నారు.

## పులిచింతల కు పెరుగుతున్న వరద ప్రవాహం

### కొనసాగుతున్న విద్యుత్ ఉత్పాదన

చింతలపాలెం అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి) :-

పులిచింతల ప్రాజెక్టులోకి వరద ఉధృతి కొనసాగుతుంది. నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ నుండి 16 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ముందస్తుగా 4 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల



చేస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటల వరకు వరకు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 44.2813 టీఎంసీలు గా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులకు గాను ఇప్పటి వరకు నీటిమట్టం 174.04 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 1,25,962 క్యూసెక్కు లు కాగా రెండు ప్రాజెక్టు గేట్లు 3 మీటర్లు, రెండు గేట్లు 3.5 మీటర్లు ఎత్తి 1,03,162 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఎడమవైపున ఉన్న విద్యుత్ కేంద్రం నుండి విద్యుత్ ఉత్పాదన కొనసాగుతుంది. పులిచింతల విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యం 120 యూనిట్లు కాగా నాలుగు యూనిట్ల నుండి 110 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు. విద్యుత్ ఉత్పాదన కోసం 16,000 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

# కే.వి.కే ని సందర్శించిన ఎం.ఎ రూరల్ డెవలప్మెంట్ విద్యార్థులు

గరిడేపల్లి అక్టోబర్ 19(ప్రజా జ్యోతి):

శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకె లో సమగ్ర వ్యవసాయ విధానాలపై అవగాహన పొందడానికి గాను టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్



సోషల్ సైన్స్ కాలేజీ తుర్కమంజిల్, హైదరాబాద్ ఎం.ఎ రూరల్ డెవలప్మెంట్ విద్యార్థులు సందర్శించినట్లు ఇంచార్జ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.నరేష్ తెలిపారు.మొదటి సంవత్సర విద్యార్థులు సమగ్ర వ్యవసాయ మరియు వ్యవసాయ మార్కెట్ విధానాలు,సాగు పద్ధతులు మొదలగునవి తెలుసుకోవడానికి క్షేత్ర సందర్శనకు వచ్చారు.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కేవలం వ్యవసాయం కాకుండా ఉ ద్యాన పాడిపంటలను, చేయడం ద్వారా రైతులు ఆదాయం పొందవచ్చునని ఒక పంట ద్వారా వచ్చిన ఉత్పత్తులు మిగులు అవశేషాలను సమగ్ర పశు పోషణ లో వినియోగించుకోవడం లాభాదాయకంగా ఉంటుందని తెలిపారు.తదుపరి విద్యార్థులను క్షేత్ర సందర్శన కు తీసుకోని వెళ్ళి పలు ప్రదర్శ మరియు ఉత్పత్తి విభాగాలలో ఆచరిస్తున్న పద్ధతుల పై ప్రాక్టికల్ గా అవగాహన కల్పించారు.ఈ పర్యటనలో భూసార పరీక్ష కేంద్రం,జీవనరుల ఉత్పత్తి కేంద్రం,వర్మికంపోస్ట్,ఉద్యాన నర్సరీ, మల్బరీ తోటల పెంపకం,ప్రొట్రేలలో మొక్కల పెంపకం,పండ్ల మొక్కల ప్రవర్ధన పద్ధతులు,అజోల్లా, తేనెటీగల పెంపకం,బొప్పాయి, జామ,సీతాఫలం,బత్తాయి,మామిడి, మునగ,మల్చింగ్ విధానంలో బీర, మిరప,టమాటో,వంగ,బంతి పూల సాగు,వర్మీ కంపోస్ట్,వర్మీ వాష్ ,నా డెప్ కంపోస్ట్ తయారీ, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు,మొదలగు క్షేత్రాల నిర్వహణ పై అవగాహన కల్పించినట్లు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కే.వి.కే శాస్త్రవేత్తలు డి.నరేష్,సిహెచ్.నరేష్, ఎ.కిరణ్,డి.ఆదర్శ్,టి.మాధురి, ఎన్.సుగంధి,ఎస్.ఏ.ఐ.ఆర్.డి,బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఘంట లక్ష్మి,టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ యూనివర్సిటీ డీన్.డాక్టర్.ఎస్.శ్రీనివాసరావు,ప్రొఫెసర్ డాక్టర్ సౌరబ్ మరియు 35 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్థ శతాబ్దోత్సవ సభను విజయవంతం చేయాలి

ప్రజా జోతి ప్రతినిధి/నల్గొండ

ఈనెల 21న జిల్లా కేంద్రంలో జరిగే అర్ధ శతాబ్దోత్సవ సభను విజయవంతం చేయాలని పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి పోలె పవన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పిడిఎస్ యు విప్లవ విద్యార్థి ఉద్యమానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా అర్ధ శతాబ్దోత్సవ సభలకు పి డి ఎస్ యు పిలుపునిచ్చిందని అందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఈ నెల 21న అంబెడ్కర్ భవన్ లో జరిగే సభ కరపత్రాలు పట్టణంలోని గర్ల్స్ హాస్టల్ లో ఆవిష్కరణ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ విప్లవ ప్రస్థానంలో అనేకమంది విద్యార్థి రత్నాలు, బిగి పిడికిలి జెండా కోసం తమ ప్రాణాలు తృణ పాయం చేశారని, కామ్రేడ్ జార్జి రెడ్డి మతోన్మాద కత్తిపోట్లకి ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నేల కొరిగాడని, కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ,శ్రీపాద శ్రీహరి నాటి ఎమర్జెన్సీ చీకట్లో నాటి నియంతృత్వ పాలకుల తుపాకి తూటాలకు తమ ప్రాణాలని అర్పించారని అన్నారు, కోలా శంకర్, చేరాలు, రంగవల్లి, స్నేహలత, మారోజు వీరన్న, మధుసూదన్ రాజు యాదవ్ , యానాల వీరారెడ్డి, రమణయ్య, సాంబన్న, వరహాలు లాంటి ఎందరో వీరులు తమ విలువైన ప్రాణాలని ప్రగతిశీల విద్యార్థి ఉద్యమానికి ఇచ్చి సంస్థని సమున్నతంగా నిలబెట్టారని అన్నారు.ఏ విద్యార్థి సంఘం కి లేని త్యాగాల చరిత్ర పీడీఎస్ యు సంస్థకి ఉన్నదని తెలియజేశారు.ధ్వంసం అవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యా కార్పొరేటికరణకి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్నీ రద్దు కోసం పీడీఎస్ యు అనునిత్యం పోరాటాలు నిర్వహిస్తోందని, పీడీఎస్ యు పోరాట స్ఫూర్తిని వివరిస్తూ అమరవీరుల ఆశయాలని ఎత్తిపడుతూ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.పిడిఎస్ యు నాయకులు విద్యార్థి, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో పి.డీ,ఎస్.యూ నాయకులు భవాని,స్వాతి,మౌనిక, రాజేశ్వరి, మాధవి, స్వప్న,కళావతి,రేణుక,పల్లవి,సుజాత తదితర విద్యార్థినీలు పాల్గొన్నారు.



## 462 పరుగులకు ఆలౌటైన భారత్

న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా అద్భుతంగా రాణించింది. కాగా.. 462 పరుగులకు భారత్ ఆలౌటైంది. 3 వికెట్లు కోల్పోయి ఇన్నింగ్స్ ప్రారంభించిన సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ అద్భుతంగా ఆడారు. దీంతో.. భారత్ 106 పరుగుల ఆధిక్యంలోకి వచ్చింది. సర్ఫరాజ్ ఖాన్ (150), పంత్ (99) పరుగులతో సూపర్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ నిలకడగా ఆడి పరుగుల పట్టికను పరుగులు పెట్టించారు. అయితే.. ఒక్క పరుగు తేడాతో పంత్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఇదిలా ఉంటే.. వీరిద్దరూ పెవిలియన్ బాట పట్టగానే టీమిండియా బ్యాటర్లు ఇలా వచ్చి అలా పెవిలియన్ కు వెళ్లిపోయారు. మధ్యాహ్నం నుంచి టీమిండియా 7 వికెట్లు కోల్పోయింది. అయితే.. న్యూజిలాండ్ విజయానికి 107 పరుగులు అవసరం.. ఈ రన్స్ కొట్టకుండా రోహిత్ సేన ఎలా అడ్డుకట్ట వేస్తుందో చూడాలి.రెండో ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటర్లు యశస్వీ జైస్వాల్(35), రోహిత్




శర్మ (52), విరాట్ కోహ్లీ (70), సర్ఫరాజ్ ఖాన్ (10), రిషబ్ పంత్ (99), కేఎల్ రాహుల్ (12), జడేజా (5), అశ్విన్ (15), కుల్దీప్ యాదవ్ (6), సిరాజ్, బుమ్రా డకౌట్ అయ్యారు. న్యూజిలాండ్ బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ, విలియం ఓ రూర్కే చెరో 3 వికెట్లతో చెలరేగారు. ఆ తర్వాత.. అజాజ్ పటేల్ 2 వికెట్లు పడగొట్టాడు. టిమ్ సౌథీ, గ్లేన్ ఫిలిప్స్ తలో వికెట్ సంపాదించారు.

ఇదిలా ఉంటే.. 107 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్.. 4 బంతులు వేసిన తర్వాత బ్యాడ్ లైట్ కారణంగా మ్యాచ్ ను అంపైర్లు నిలిపివేశారు. దీంతో.. ఆటకు అంతరాయం కలిగింది. తిరిగి నేటికి ఆట ప్రారంభం కానుంది. కాగా.. ఆటకు నేడు ఒక్క రోజు మాత్రమే సమయం ఉంది. 107 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ చేధిస్తే గెలుస్తుంది.. లేదంటే 107 పరుగుల లోపు భారత్ బౌలర్లు ఆలౌట్ చేస్తే టీమిండియా గెలుపొందుతుంది. అలా కాకుండా.. 107 పరుగుల లోపు కట్టడి చేస్తే మ్యాచ్ డ్రా అవుతుంది. చూడాలి మరి రోహిత్ సేన ఎలా ప్రదర్శిస్తారో